

నేటి అలంకారం
గాయత్రి దేవి

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 23 సెప్టెంబరు 2025







అమ్మవారి గర్భాలయం నుంచి ఉత్సవ మూర్తిని తీసుకొస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, దేవస్థానం అధికారులు (ఇన్‌సెట్‌లో) బాలాత్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం

ముక్కోటి దేవతలు కదలిరాగా, మంగళవాయిద్యాలు మార్మోగగా, ఢమరుక శబ్దాలు, భేరీనాదాలు, పాంచజన్య ప్రణవనాదాలు, భక్తుల జయజయధ్వానాలతో ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువకు ముందే తరలివచ్చిన అశేష భక్తజనం అమ్మ తొలిదర్శనం చేసుకుంది. బాలాదేవిగా కొలువుదీరిన దుర్గమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించింది. నగరోత్సవ వైభవం.. సాంస్కృతిక వైభోగంతో ఇంద్రకీలాద్రి మరింత వెలుగులీనింది.

# బాలా.. నిత్యకల్యాణశీల

## ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ప్రారంభం

## బాలాత్రిపురసుందరిదేవిగా అమ్మ దర్శనం

- తొలి దర్శనానికి తరలివచ్చిన భక్తులు
- వేకువజాము నుంచే కిటకిటలాడిన క్యూలైన్లు
- నయనానందకరంగా నగరోత్సవం
- దేవీ వైభవాన్ని చాటిన సాంస్కృతిక ప్రదర్శనలు



ఇంద్రకీలాద్రిపై క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/చిట్టినగర్): ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారు జామున అమ్మవారికి అర్చకులు స్నపన క్రతువు నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు దేవదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి అనిత తొలి దర్శనం చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారు తొలి రోజున

మిగతా 6లో..



### యాగశాల, పూజా మండపం ప్రారంభం

ఇంద్రకీలాద్రిపై నూతనంగా నిర్మించిన రాతి యాగశాల, పూజా మండపాన్ని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారు. కృష్ణాజిల్లాకు చెందిన సంగా నరసింహారావు యాగశాలను నిర్మించారు. ఇక నుంచి చండీహోమం ఇక్కడే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. పూజా మండపంలో అన్ని పూజలు జరుగుతాయి. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ డాక్టర్ హరిజవహర్‌లాల్, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సువాసినీ పూజలో అర్చక స్వామి

### సారె సమర్పించిన పోలీసులు

దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో తొలి రోజున పోలీసులు అమ్మవారికి సారెను సమర్పించారు. పోలీసుల తరఫున పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి సారెను తీసుకెళ్లారు. వారికి ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చారు.



దుర్గమ్మ సన్నిధిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

# తీరని బుసక దాహం!

## ముడా భూముల్లో ఆగని అక్రమ తవ్వకాలు

- మంత్రి రవీంద్ర హెచ్చరించినా పట్టించుకోని అక్రమార్కులు
- పోర్టు విస్తరణ రెండో విడత పనులు ముడా భూముల్లోనే..
- 600 ఎకరాల్లో బుసక తవ్వకాలతో గుంతలు
- వీటిని పూడ్చేందుకు ఏడాది పడుతుందని అధికారుల అంచనా
- అభివృద్ధి నిరోధకులుగా బుసకాసురులు



ముడా భూముల్లో బుసక తవ్వడంతో ఏర్పడిన గుంతలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం పోర్టు నిర్మాణం 16 బెర్తులలో పూర్తిస్థాయిలో నిర్మాణానికి 5,200 ఎకరాల భూమి అవసరం. తొలి విడతగా నాలుగు బెర్తుల నిర్మాణ పనులను రెండు వేల ఎకరాల విస్తీర్ణంలో చేస్తున్నారు. ఇప్పటికే 50 శాతం లోపు పోర్టు పనులు పూర్తయ్యాయి. 2026 అక్టోబరు నాటికి పోర్టు పనులు పూర్తి చేసి సరుకుల ఎగుమతులు, దిగుమతులు ఇక్కడి నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఒక ఏడాది ఆలస్యమైనా 2027 చివరి నాటికైనా మచిలీపట్నం పోర్టు ద్వారా సరుకుల ఎగుమతులు, దిగుమతులు ప్రారంభంకావడం ఖాయంగా కనిపిస్తోంది. పోర్టు నిర్మాణం కోసం తొలుత ప్రభుత్వ భూములు, బే ఆఫ్ బెంగాల్ భూములు రెండు వేల ఎకరాల్లో పనులు ప్రారంభించారు. పోర్టు నిర్మాణంలో భాగంగా 16 బెర్తులను నిర్మాణం చేస్తే ఐదు వేల ఎకరాల భూమి కావాలని అప్పట్లో అధికారులు డీటెయిల్డ్ ప్రాజెక్టు

మిగతా 6లో..

### మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించినా!

ఈ నెల మొదటి వారంలో ముడా భూముల నుంచి బుసకను తవ్వి విక్రయిస్తున్న కరగ్రహారం, క్యాంప్‌బెల్‌పేట గ్రామస్థులతో మంత్రి కొల్లు రవీంద్ర సమావేశం నిర్వహించారు. పోర్టు పనులకు, సముద్రతీరం వెంబడి గ్రామాలకు ముప్పు తెచ్చిపెట్టేలా బుసక తవ్వకాలు చేస్తుంటే వెంటనే నిలిపివేయాలని చెప్పారు. వినకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండు, మూడు రోజుల పాటు మంత్రి ఆదేశాలను పాటించిన బుసక అక్రమార్కులు ఆ తర్వాత మళ్లీ బుసక తవ్వకాలను ప్రారంభించారు. గోపువానిపాలెం, తపసిపూడి గ్రామాల పరిధిలోని ముడా భూముల్లో బుసక తవ్వకాలు సాగుతూనే ఉన్నాయి.

మచిలీపట్నం నార్త్ మండల పరిధిలోని మచిలీపట్నం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా)కు చెందిన భూముల్లో బుసక అక్రమ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొందరు స్వార్థపరులు అక్రమార్జన కోసం రోజురోజుకు బుసక వ్యాపారాన్ని మరింతగా విస్తరిస్తున్నారు. పోర్టు నిర్మాణం కోసం రైతులు ప్రభుత్వానికి విక్రయించిన భూముల్లో బుసక తవ్వి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. పార్టీలను పక్కనపెట్టి మాఫియాగా ఏర్పడిన అక్రమార్కులు ప్రభుత్వ భూముల నుంచి బుసకను తవ్వేస్తున్నా పాలకులు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

# అదరహో..

## అట్టహాసంగా విజయవాడ ఉత్సవ్ ప్రారంభం

- ఉర్రూతలూగించిన మ్యూజికల్ షో
- వైవిధ్య భరితంగా కళాప్రదర్శనలు

విజయవాడ ఉత్సవ్ కుర్రకారును ఉర్రూతలూగించింది. వైవిధ్యభరితంగా సాగిన కళాప్రదర్శనలు వారసత్వ కళలకు అద్దం పట్టాయి. మ్యూజికల్ నైట్ యువతలో జోష్‌ను నింపింది. 11 రోజులపాటు సాగే విజయవాడ ఉత్సవ్ సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. పున్నమిఘాట్ రోడ్డులో మ్యూజికల్ షో, తుమ్మపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో కళా ప్రదర్శనలు అలరించాయి. గొల్లపూడిలో వైబ్రెంట్ ఎగ్జిబిషన్ గేట్లు తెరుచుకున్నాయి. హెలికాప్టర్‌లో గగనతలం నుంచి బెజవాడ అందాలను పలువురు వీక్షించి ఆనంద భరితులయ్యారు.

విజయవాడ సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యువత కేరింతల నడుమ విజయవాడ ఉత్సవ్ సోమవారం అట్టహాసంగా ఆరంభమైంది. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పున్నమి ఘాట్‌లో మ్యూజికల్ షోను ప్రారంభించారు. ఈ షో యువతను ఉర్రూతలూగించింది. హైదరాబాద్‌కు చెందిన శ్రావ్య మానస బృందం సభ్యులు 24 మంది చేసిన నవ దుర్గాదేవి డాన్స్ అలరించింది. వీరు చేసిన శివతాండవానికి వేదిక ఊగిపోయింది. లయబద్ధంగా వారు చేసిన ప్రదర్శన దసరా శోభను తీసుకువచ్చింది. ఆ తర్వాత మూన్ లైట్ సింఫనీ మహారాష్ట్ర బృందం పాడిన హిందీ భక్తి గీతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకొచ్చాయి. ఈ బృందంలో వయోలిన్, వేణు గాన బృందాలు పాటకు తగ్గట్టుగా వినసొంపైన సంగీత సహకారాన్ని అందించారు. భక్తి గేయాలతో ఉత్తర భారత వాతావరణాన్ని విజయవాడకు తీసుకొచ్చారనే సంభాషణ ప్రేక్షకుల మధ్య జరిగింది. వేదికపై

మిగతా 6లో..



ఏపీ, తెలంగాణ బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారత్ ఓవెన్‌ను సన్మానిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి నారా లోకేశ్, చిత్రంలో మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్

# తగ్గని ధరలు!

## పన్ను శ్లాబుల తగ్గింపులో నిర్లక్ష్యం

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో నిత్యావసరాల ధరలను తగ్గించని రిటైలర్లు
- హోల్‌సేల్ వ్యాపారుల నుంచి ప్రయోజనాలు పొందినా.. తగ్గుదల లేదు!
- రిటైలర్లపై దృష్టి సారించని తూనికలు, కొలతల శాఖ అధికారులు
- నేటి నుంచి సూపర్ మార్కెట్లలో ధరల తగ్గింపు
- తగ్గిన ఏసీలు, టీవీలు, వాషింగ్ మెషీన్స్ ధరలు
- ఆటోమొబైల్‌లో కార్లు, ద్విచక్ర వాహనాల ధరలు కూడా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చినప్పటికీ ఉమ్మడి కృష్ణాజిల్లాలో మాత్రం నిత్యావరాల ధరల్లో తగ్గింపు అమలు కాలేదు. రిటైల్ దుకాణాలు, సూపర్ మార్కెట్లలో కూడా ధరలు తగ్గించలేదు. సూపర్ మార్కెట్లలో మంగళవారం నుంచి అమల్లోకి వస్తుందని యాజమాన్యాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ మినహాయింపులకు సంబంధించి జీఎస్టీ, తూనికలు, కొలతల శాఖల మధ్య తలెత్తిన సమన్వయలేమి కారణంగా రిటైలర్లు




పాత ధరలనే వసూలు చేశారు. బడా రిటైలర్లు ఎలాంటి తగ్గింపును ఇవ్వలేదు. దీంతో సాధారణ పచారీ కొట్లలో కూడా అమలు

మిగతా 6లో..



ఇంద్రకీలాద్రి కిటకిట.. 6
8 సంగమంలో విజయనర్తనం

# కీలాద్రి కిటకిట..


బాలా త్రిపుర సుందరీదేవి దేవికి ప్రత్యేక పూజలు




- వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- తొలిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దుర్గమ్మ దర్శనం
- తెలుగు రాష్ట్రాల నుంచి పోటెత్తిన జనం
- దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :** ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు తొలి రోజున బాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెలురాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్, నందిగామ, ఇబ్రహీంపట్నం వైపు నుంచి వచ్చే భక్తులు పున్నమిఘాట్‌లో స్నానాలు చేసుకుని కుమ్మరిపాలెం వద్ద ఏర్పాటుచేసిన క్యూ నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల నుంచి, ఏలూరు రోడ్డువైపుగా వచ్చే భక్తులు సీతమ్మపాదాల ఘాట్‌లో స్నానాలు చేసి వినాయకస్వామి గుడి వద్ద ఏర్పాటుచేసిన క్యూ ద్వారా దర్శనం చేసుకున్నారు. కేశఖండన శాలలో అధికసంఖ్యలో భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఇబ్రహీంపట్నం మీదగా వచ్చే భక్తులు తలనీలాలు సమర్పించుకోవడం కోసం కొంచెం ఇబ్బంది పడ్డారు.

### కొండపైకి ఉచిత బస్సులు

అమ్మవారిని దర్శించుకోవడం కోసం వచ్చే భక్తుల్లో వృద్ధులు, వికలాంగుల, చిన్నారుల కోసం దాతలు బస్సులను ఏర్పాటుచేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత బస్సులు రద్దీగానే ప్రయాణించాయి.

### కిటకిటలాడిన లడ్డూ కౌంటర్లు

మొదటిరోజే అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి ఆసక్తి చూపడంతో ప్రసాదం విక్రయించే కౌంటర్లు కిటకిటలాడాయి. 11 భారీ కౌంటర్లు ఏర్పాటు చేసినప్పటికీ భక్తులతో కౌంటర్లు కిక్కిరిసిపోయాయి. కనీసం అరగంటకుపైగా సమయం పడుతోంది. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల కోసం అదనంగా మరో కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

### క్యూలలోనే భక్తులకు అన్న ప్రసాదం



కనకదుర్గమ్మ దర్శనం అనంతరం అన్నప్రసాదం స్వీకరించేందుకు భక్తులు కుటుంబ సమేతంగా అన్న ప్రసాద కేంద్రానికి వచ్చారు. అన్నప్రసాద కేంద్రం దగ్గర రద్దీ లేకుండా ఈసారి దేవస్థాన అధికారులు చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. క్యూలో వచ్చే భక్తులకు విస్తర్లలో వంటకాలను వడ్డించారు. ఎంతమంది భక్తులు వచ్చినా తోపులాట, గందరగోళానికి లోనవకుండా అధికారులు ఏర్పాట్లుచేశారు. నాలుగువైపులా నాలుగు కౌంటర్లు ఏర్పాటుచేశారు. బఫే పెట్టి వృద్ధులు, చిన్నారులు కూర్చొని తినడానికి వీలుగా తివాచీలు పరిచారు. కౌంటర్లు ఎక్కువగా ఉండడం వల్ల తోపులాటలు జరగకుండా భక్తులు ప్రశాంతంగా అమ్మవారి ప్రసాదాన్ని ఆరగించారు.

## తొలిరోజు ఆదాయం రూ.22.79 లక్షలు

**ఇంద్రకీలాద్రి :** దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా మహోత్సవాలలో మొదటిరోజు సోమవారం సాయంత్రం 5.30 వరకు వివిధ రూపాల్లో మొత్తం రూ.22,79,264లు ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.300లు టిక్కెట్‌ల ద్వారా రూ.9లక్షలు, రూ.100ల ద్వారా రూ.3,10,000లు, రూ. 15 లడ్డూ ప్రసాదం ద్వారా రూ.1,50,000లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.7,70,000లు లభించినట్టు పేర్కొన్నారు. కుంకుమార్చనల రూ.3వేలు టిక్కెట్టు ద్వారా రూ.33వేలు, రూ.5వేలు టిక్కెట్ ద్వారా రూ.5వేలు, చండీహోమం రూ.4వేలు టికెట్ ద్వారా రూ.4వేలు, శ్రీచక్రనవావరణార్చన రూ.3వేలు టిక్కెట్ల ద్వారా రూ.30వేలు, ఖడ్గమాలార్చన రూ.5,116లు టిక్కెట్ల ద్వారా రూ.20,464లు, తలనీలాల రూ.40 టిక్కెట్ల ద్వారా రూ.56,800లు, మొత్తం రూ.22,79,264లు లభించినట్టు ఈవో వివరించారు. రాత్రి 10 గంటల వరకు భక్తులు సుమారు 70వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని, ఈవో ఆ ప్రకటనలో తెలిపారు.

### బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లకు భక్తుల తాకిడి



నగరంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్ అన్నిప్రాంతాలు భక్తులతో రద్దీగా మారాయి. అమ్మవారి దర్శనానికి దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి వాహనాలను కొండమీదకి అనుమతించరనే విషయం తెలియకపోవడంతో అధికశాతం మంది భక్తులు అక్కడికి చేరుకోవడంతో కొంత రద్దీ ఏర్పడింది.

### జల్లు స్నానాల వద్ద..



**పాత రాజరాజేశ్వరి పేట :** అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా అధికారులు జల్లు స్నానాల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కృష్ణానది ఉధృతంగా ఉన్న నేపధ్యంలో శనైశ్చర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన జల్లు స్నానాల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఐరన్ రైలింగ్‌తో పాటుగా అడుగడుగునా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు.

### పిల్లలు తప్పిపోకుండా..



దసరా ఉత్సవాల్లో చిన్నారులు తప్పిపోకుండా ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్(ఐసీడీఎస్) అధికారులు చర్యలు తీసుకున్నారు. చిన్నారుల చేతులకు ట్యాగ్‌లు వేసి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను నమోదు చేస్తున్నారు. సీఎంఎస్ యాప్‌కు సదరు ట్యాగ్‌లు అనుసంధానం అవుతాయి. చిన్నారులు తప్పిపోతే యాప్ ద్వారా ఎక్కడ ఉన్నది తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించడం జరుగుతుంది.

### అమ్మవారికి పోలీసుల సారె

**విజయవాడ/చిట్టినగర్ :** దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో తొలిరోజున పోలీసులు అమ్మవారికి సారె సమర్పించారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు దంపతులు వన్‌టౌన్ స్టేషన్ నుంచి ఊరేగింపుగా ఇంద్రకీలాద్రికి సారెను తీసుకెళ్లారు. వారికి ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు.

### కేశఖండనశాలపై భక్తులు ఫిర్యాదు

సీతమ్మపాదాల వద్ద శనీశ్వరస్వామి దేవాలయానికి ఎదురుగా ఏర్పాటుచేసిన కేశఖండనశాలలో అధిక సంఖ్యలో భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. తలనీలాలకు అధికారులు టోకెన్ ధరను రూ.40గా నిర్ణయించారు. భక్తులు వద్ద చిల్లర లేక రూ.50 ఇస్తే సిబ్బంది మిగిలిన పది రూపాయలు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. రూ.100 ఇచ్చినా రూ.50 ఇచ్చి పదిరూపాయలు చిల్లర లేదనే సమాధానం చెబుతున్నారని ఆరోపిస్తున్నారు.


వెంకయ్యనాయుడు, సుజనాచౌదరిలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

### దుర్గమ్మ సేవలో ప్రముఖులు


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు దంపతులు

**ఇంద్రకీలాద్రి :** ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రులలో బాలా త్రిపుర సుందరి అలంకారంలో దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మను సోమవారం మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుజనా చౌదరిలు దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించగా, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఈవో శీనా నాయక్ వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి దర్శనం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి సుభిక్షంగా ఉండాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. అరాచక శక్తుల నుంచి కాపాడాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ దసరా నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్ రావు దంపతులు, ప్రముఖ సినీ సంగీత దర్శకులు మణిశర్మ, న్యాయమూర్తులు ఉన్నారు.


హోంమంత్రి అనిత

### ఆనందంగా ఉంది : ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ



బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవటం చాలా ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ అన్నారు. సోమవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ 41 రోజులపాటు అమ్మవారి దీక్ష చేయటం తనకు అలవాటని చెప్పారు.

### ప్రజలందరికీ అమ్మ ఆశీస్సులుండాలి : మణిశర్మ



ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రముఖ సినీసంగీత దర్శకుడు మణిశర్మ అన్నారు. ఆయన తన బృందంతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారని కితాబిచ్చారు.


కుటుంబసభ్యులతో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు


జానపద నృత్య కళాకారులు


ప్రత్యేక కుంకుమార్చనలో భక్తులు


దుర్గమ్మ నగరోత్సవం


వృద్ధులకు రెడ్‌క్రాస్ సేవలు


ఏర్పాట్లపై పోలీసు సిబ్బందికి ఈవో ఆదేశాలు

## భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

» మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**కలెక్టరేట్ :** భక్తులు అమ్మవారిని ఆధ్యాత్మికత వాతావరణంలో దర్శించుకుంటున్నారు. పటిష్టమైన ఏర్పాట్లు చేయడం వల్ల ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయి. భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రోటోకాల్ దర్శనాలకు ప్రత్యేకంగా స్లాట్లు కేటాయించాం. దాదాపు 6వేల మంది పోలీస్ సిబ్బంది విధుల్లో ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భక్తుల భద్రతను పర్యవేక్షిస్తున్నాం.

సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు అమ్మవారిని దర్శించుకున్న హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన జగన్మాతను ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆమె మీడియా పాయింట్లో మాట్లాడుతూ, సామాన్య భక్తులకు సంతృప్తికర దర్శన భాగ్యం కలిగించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని పేర్కొన్నారు.

» యుద్ధప్రాతిపదికన సమస్యల పరిష్కారం : కలెక్టర్ లక్ష్మీశ



**కలెక్టరేట్ :** భక్తుల సమస్యలను క్యూ ఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ ద్వారా తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో తొలిరోజు సోమవారం వినాయకుని గుడి ప్రారంభం నుంచి చిన్న రాజగోపురం వరకు కాలినడకన సామాన్య భక్తుల క్యూలైన్‌లో నడిచి వచ్చి భక్తుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఏర్పాట్లు బాగున్నాయని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. భక్తులు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆహ్లాదకర వాతావరణంలో, ఆధ్యాత్మిక వాతావరణంలో దర్శనం చేసుకొంటున్నారన్నారు. సామాన్య భక్తుల సంతృప్తికర దర్శనమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం సేవలందించాలని ఆదేశించారు. వినాయక టెంపుల్, వీఎంసీ పాయింట్, కేశఖండనశాల, సీతమ్మవారి పాదాలు, పున్నమిఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వైద్య శిబిరాలలో చేసిన ఏర్పాట్లు తనిఖీ చేశారు.

### సామాన్య భక్తులకు సులువుగా దుర్గమ్మ దర్శనం

- ఈవో శీనానాయక్, ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ

**ఇంద్రకీలాద్రి :** దుర్గమ్మను దర్శించుకోవటానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని, ప్రతిఒక్కరూ క్యూలలో వెళ్లి అమ్మవారిని దర్శించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఈవో శీనానాయక్, ఏడీసీపీ గుణ్ణం రామకృష్ణ ఉద్యోగులకు సూచించారు. సోమవారం ఈవో ఏడీసీపీ కొండపై ఆలయ ప్రాంగణంలో పర్యటించారు. నటరాజస్వామి ఆలయం మెట్ల వద్ద నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వైపు పోలీసులు బారికేడ్లను అడ్డం పెట్టడంతో భక్తులు పెద్దఎత్తున నిలిచిపోయారు. విషయం తెలుసుకున్న ఏడీసీపీ విధుల్లో ఉన్న సిబ్బందిని భక్తులకు ఇబ్బందులు కలిగించకుండా అమ్మవారి దర్శనం అనంతరం బయటకు పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### విధుల్లో ఎస్‌ఐకు ఛాతినొప్పి

**ఇంద్రకీలాద్రి :** దసరా ఉత్సవాలలో ఘాట్‌రోడ్డులో సోమవారం విధుల్లో ఉన్న అనకాపల్లి జిల్లాకు చెందిన ఎస్.ఐ పి.వి.రమణ (60)కు ఛాతినొప్పి రావటంతో పోలీస్ అధికారులు అతనిని హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పలు టెస్ట్‌లు నిర్వహించారు. ప్రస్తుతం అతను క్షేమంగా ఉన్నట్టు వన్‌టౌన్ సీఐ గురు ప్రకాష్ తెలిపారు.

## తగ్గని ధరలు!

(5వ పేజీ తరువాయి)

జరగలేదు. జీఎస్టీ అధికారులు మాత్రం ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని చెబుతున్నారు. రిటైలర్లు హోల్‌సేలర్ల నుంచి ప్రయోజనాలు పొందే అవకాశం ఉన్నా కూడా పాత ధరలనే వసూలు చేశారు. తగ్గిన ధరలతో సరికొత్త ఎమ్మార్పీ స్టిక్కర్లను అంటించాల్సి ఉండగా, ఆ పని చేయలేదు. పోనీ స్టిక్కర్లు అంటించటం పెద్ద పని అనుకున్నా తగ్గించి అయినా విక్రయించలేదు. దీనిపై జీఎస్టీ అధికారులను వివరణ కోరగా.. స్టిక్కర్లు అంటించి తగ్గించటమనేది లీగల్ మెట్రాలజీ అధికారుల చూడాల్సిన వ్యవహారమని చెబుతున్నారు. సోమవారం నుంచి తగ్గించాలని ఎప్పుడో ఆదేశాలు ఇస్తే.. చివరి వరకు కూడా ఏ శాఖ పట్టించుకోకపోవటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. నగరంలోని గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్ కమిటీని దీనిపై వివరణ కోరగా.. తాము జీఎస్టీ లేని, మారని నిత్యావసరాలను మాత్రమే సరఫరా చేస్తున్నామని పేర్కొంటున్నారు. ధరలు ఎందుకు తగ్గించలేదని కాళేశ్వరరావు మార్కెట్, ఇతర మార్కెట్లలోని రిటైల్ వ్యాపారులను ప్రశ్నించగా.. కాస్మోటిక్స్ పేస్టులు, సబ్బులు, ప్యాక్డ్ ప్రొడక్ట్స్, లిక్విడ్స్, స్నాక్ ఫుడ్స్ వంటి వాటిని ఆయా కంపెనీల డీలర్లు నెలలో రెండు సార్లు సరుకును ఇస్తారని.. పాత సరుకు తమ దగ్గర ఉన్నందున తగ్గించలేమని చెబుతున్నారు. వాస్తవానికి ఆయా కంపెనీల నుంచి రిటైలర్లు ప్రయోజనాలు పొందుతారు. ఈ విషయం వారికి తెలిసినా వినియోగదారులకు మాత్రం ఇలాంటి సమాధానాలు చెబుతున్నారు. ఇప్పటికైనా జీఎస్టీ, తూనికలు, కొలతలశాఖ అధికారులు రంగంలోకి దిగకపోతే రిటైలర్ల దోపిడీ కొనసాగే ప్రమాదం ఉంది. నిత్యావసరాలకు సంబంధించి పప్పుదినుసులు, బియ్యం వంటి వాటిపై ఇప్పటికే జీఎస్టీ లేదు. వంట నూనెలు, పంచదారపై ఇప్పటికే ఐదు శాతం జీఎస్టీ అమల్లో ఉండటం వల్ల తగ్గింపు లేదు. నిత్యావసరాలలో భాగంగా సబ్బులు, పేస్టులు, స్నాక్ ప్రొడక్ట్స్, లిక్విడ్స్ తదితరాలకు సంబంధించి జీఎస్టీ మినహాయింపులు ఉన్నా తక్షణ తగ్గింపు అమల్లోకి రాలేదు. ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు సంబంధించి మాత్రం తక్షణ తగ్గింపు అమల్లోకి వచ్చింది. కార్లపై రూ.1.20 లక్షల వరకు తగ్గింపు లభించింది. టీవీలపై రూ.4 వేల నుంచి రూ. 10 వేల వరకు, ఏసీలపై రూ.4 వేల నుంచి రూ.10 వేల వరకు, ద్విచక్రవాహనాలపై రూ.7 వేల నుంచి రూ. 9 వేల వరకు, హైయ్యండ్ ద్విచక్రవాహనాలపై రూ.14 వేల వరకు తగ్గింపు లభించింది. తక్షణం తగ్గింపును అమల్లోకి తీసుకురావటం జరిగింది. నగరంలోని విజయ డెయిరీ ఉత్పత్తులకు సంబంధించి వెన్న, నెయ్యి వంటి ఉత్పత్తులపై తక్షణం తగ్గింపు అమల్లోకి వచ్చింది.

## తీరని బుసక దాహం!

(5వ పేజీ తరువాయి)

రిపోర్టును తయారు చేశారు. దీనిలో భాగంలో సముద్రతీరం వెంబడి ఉన్న గోపువానిపాలెం, తపసిపూడి, కరగ్రహారం, చిలకలపూడి, మంగినపూడి రెవెన్యూ గ్రామాల పరిధిలోని 750 ఎకరాల పట్టా భూమిని ఎకరం రూ.25లక్షల చొప్పున రైతుల నుంచి 2018లో టీడీపీ ప్రభుత్వం ముడా ద్వారా కొనుగోలు చేసింది. పోర్టును రెండో విడతలో అభివృద్ధి చేస్తే ముడా ద్వారా కొనుగోలు చేసిన భూములను వినియోగించుకోవచ్చనే ఉద్దేశంతో వాటిని రిజర్వులో ఉంచారు. ముడా ద్వారా కొనుగోలు చేసిన భూములు ఖాళీగా ఉండటంతో వాటిపై అక్రమార్కుల కన్నుపడింది. రెవెన్యూ, మైనింగ్, ముడా అధికారులతో అక్రమార్కులు కుమ్మక్కై గత నాలుగు సంవత్సరాలుగా వైసీపీ, కూటమి నాయకులు మాఫియాగా ఏర్పడి ఈ భూముల్లోని బుసకను తవ్వి విక్రయించేస్తున్నారు. ఇప్పటి వరకు ముడాకు చెందిన 600 ఎకరాల్లో బుసక తవ్వకాలు జరిగినట్లుగా అంచనాగా ఉంది.

### బుసక తవ్వడం వల్ల నష్టం ఇలా..

పోర్టు నిర్మాణం తొలిదశ పనులు పూర్తయి వ్యాపారం పుంజుకుంటే రెండో విడతలో మరో 12 బెర్తులను నిర్మాణం చేయాల్సి ఉంది. రెండో విడత పనుల కోసం ముడా ద్వారా కొనుగోలు చేసిన భూములను వాడుకోవాలి. కానీ ముడా కొనుగోలు చేసిన భూముల నుంచి బుసకను అక్రమార్కులు యంత్రాలతో పెద్దపెద్ద గోతులుగా తవ్వి తరలించేస్తున్నారు. ఇక్కడ పోర్టు నిర్మాణానికి సంబంధించిన భవనాలు, గోడౌన్‌లు, ఇతరత్రా కట్టడాలు నిర్మించాలంటే ఇప్పుడున్న గోతులను పూర్తిస్థాయిలో పూడ్చాలని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. వందల ఎకరాల్లో ఉన్న గోతులను మట్టి, లేదా బుసకతో పూడ్చేందుకు ఏడాదికిపైగా సమయం పడుతుందని సాంకేతిక నిపుణులు అంటున్నారు. ఇంత మేర మట్టి, బుసకను ఎక్కడి నుంచి తరలించాలనే అంశంపైనా ఆలోచన చేయాల్సి ఉందని వారు పేర్కొంటున్నారు. గోతులు పూడ్చేందుకు ఏడాది సమయం పట్టడంతోపాటు ఖర్చు కూడా అధికంగా అవుతుందని అంటున్నారు. గోతులను పూడ్చిన తర్వాత పెద్దపెద్ద భవనాలు నిర్మించేందుకు భూమి అనుకూలంగా మారడానికి మరో ఏడాది పడుతుందని, ఈ రెండేళ్లపాటు సమయం వృథా అవుతుందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

## బాలా.. నిత్యకల్యాణశీల

(5వ పేజీ తరువాయి)

శ్రీబాలాత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది మొదటి రోజు నుంచి భక్తులు ఇంద్రకీలాద్రికి పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాత్రి ఏడు గంటల సమయానికి అమ్మవారిని 52,850 మంది దర్శించుకున్నారు. 55,474 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. 977 మంది వీఐపీ కోటాలో దర్శనానికి వచ్చారు. దర్శనానికి గంట సమయం పడుతోంది. మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ కంట్రోల్‌లో ఏఐ ద్వారా ఎప్పటికప్పుడు గణాంకాలు తీసుకుంటున్నారు. కనకదుర్గమ్మ మంగళవారం శ్రీగాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

## అదరహో..

(5వ పేజీ తరువాయి)

ఈ బృందం గానం చేస్తుంటే, వేదిక కింద మార్వాడీలు చేసిన నృత్యాలు, కోలాట ప్రదర్శన ఆకట్టుకున్నాయి. చివరిగా వాస్కో బృందం చేసిన దాండియా నృత్యం అలరించింది. ఈ బృందంతో కలిసి దేవకీ నందన వాసుదేవ చిత్రం హీరోయిన్ మానస వారణాసి కలిసి దాండియా నృత్యం చేసి ఆకట్టుకుంది. అనంతరం ఇదే బృందం అద్భుతమైన కోలాట ప్రదర్శన ఇచ్చింది. వేదికపై ఈ బృందం కోలాట ప్రదర్శన ఇస్తుంటే.. వేదిక కింద యువత సైతం స్టెప్పులు కలిపారు. ఈ కార్యక్రమాలను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రులు రవీంద్ర, వంగలపూడి అనిత, కొలుసు పార్థసారధి, కలెక్టర్ జి.లక్ష్మీశ, స్వచ్ఛంద కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి తదితరులు వీక్షించారు. గొల్లపూడిలో ఎగ్జిబిషన్ ప్రారంభమైంది.

## అసెంబ్లీ వేదికగా



**శాసనసభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం అసెంబ్లీలో పలువురు ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావించారు.**

### అంతర్జాతీయ ప్రమాణాలతో లైబ్రరీ నిర్మాణం జరగాలి



- ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

**అవనిగడ్డ :** అమరావతిలో స్టేట్ లైబ్రరీ నిర్మాణం మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో జరగాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్షించారు. సోమవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాల శాఖకు సమర్థవంతమైన యువనేత నారా లోకేశ్ మంత్రిగా ఉండటంతో గ్రంథాలయాల అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందన్నారు.

### పెసరకు గిట్టుబాట ధర ఇవ్వాలి



ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ :** పెసర రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి నియోజకవర్గంలోని కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో రైతుల వద్ద మూడు వేలటన్నుల వరకూ పెసల నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాకు రూ.5వేల నుంచి రూ.6 వేలు మాత్రమే ధర లభిస్తుండగా.. ప్రభుత్వం తక్షణమే స్పందించి గిట్టుబాటు ధర అందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి.

### శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించండి



- ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

**పామర్రు:** నియోజకవర్గ పరిధిలోని హైందవ శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. హిందూ శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.20లక్షలు కేటాయించాలి.

### డొంక రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలి



- ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**పెనమలూరు :** రైతు కష్టానికి, ఆహార భద్రతకు అనుబంధంగా ఉన్న డొంక రోడ్లను అభివృద్ధి చేయాలి. గ్రావెల్ లేక డొంక రోడ్ల అభివృద్ధి ఆగిపోయి పొలాల్లోకి రైతులు ఎరువులను తీసుకెళ్లలేక పోతున్నారు. ఇది రైతు ఉత్పత్తి ఖర్చుపై అదనపు భారం మోపుతోంది. లారీ యజమానులు లారీలు నడపలేని స్థితిలో కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి నెలకొంది.

### విమానాశ్రయ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



**గన్నవరం :** గన్నవరం విమానాశ్రయ విస్తరణ నిర్వాసితుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి. విమానాశ్రయ విస్తరణలో 423 మంది ఇళ్లు కోల్పోగా వారిలో 300 మంది పేద ఎస్సీలు ఉన్నారు. ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఒక్కొక్కరికి తొమ్మిది లక్షల పరిహారంగా ఇవ్వాలి. ఇందు నిమిత్తం రూ.59 కోట్లు కేటాయించాలి. రూ.459 కోట్లతో చేపట్టిన విమానాశ్రయ టెర్మినల్ భవన నిర్మాణం వేగవంతం చేయాలి.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 128, 137, 148 |
| చికెన్ విత్ స్కిన్ | 244 |
| చికెన్ స్కిన్‌లెస్ | 254 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

## ప్రైమవేరా సాఫ్ట్‌వేర్‌పై వర్క్‌షాప్

**కానూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):** కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రైమవేరా సాఫ్ట్‌వేర్‌పై వారం రోజులపాటు జరిగే వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి శివాజీబాబు మాట్లాడుతూ, సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్యాడ్ నిపుణులు కె. నాగు, డాక్టర్ కోగంటి శ్యామ్‌ప్రకాష్ పాల్గొన్నారు.



## గుర్రపుడెక్క తూడు తొలగింపు



**హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి)** : డ్రెయిన్లపై గల వంతెనల వద్ద గుర్రపుడెక్కతో కూడిన చెత్త అడ్డుపడటంతో పొలాలు ముంపు గురయ్యే ప్రమాదాన్ని గ్రహించి యుద్ధప్రాతిపదికన అడ్డంకులు తొలగించేలా చర్యలు చేపట్టినట్లు డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ వివరించారు. ఆరుగొలను వద్ద గల బొబ్బెల కోడు డ్రెయిన్‌పై గల వంతెన వద్ద పట్టుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, ఇతర వ్యర్థాలు తొలగించే కార్యక్రమాన్ని రైతులు, టీడీపీ నాయకులతో కలిసి సోమవారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు బేతా శేషుకుమార్, తుమ్మల బ్రహ్మాజీ, రైతులు పాల్గొన్నారు.

## డిజిటల్ సేవలపై అవగాహన

**ఉంగుటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :** గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ మౌలికసదుపాయాలను మెరుగుపరచి, హైస్పీడ్ ఇంటర్నెట్ వినియోగాన్ని పెంచడం ద్వారా సమాచార, సాంకేతిక సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించడమే డిజిటల్ ఇండియా లక్ష్యమని తేలప్రోలు ఉషా రామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. స్థానిక కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం పొట్టిపాడులో డిజిటల్ ఇండియా సేవలపై ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితులకు రిమాండు

**పెనమలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):** మద్యం దుకాణం వద్ద ఈ నెల 20న యనమలకుదురుకు చెందిన సత్యనారాయణ అనే యువకుడి హత్యకేసులో నిందితులను పెనమలూరు పోలీసులు రిమాండుకు తరలించారు. ముద్దాయిలు దేవరపల్లి భవానీ శంకర్, మార్కాపురపు అయ్యప్పలను హత్య జరిగిన రోజే అదుపులోకి తీసుకొన్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. హతుడు సత్యనారాయణతో పాటు నిందితులిద్దరు యనమలకుదురుకు ఇందిరానగర్‌కట్ట చెందినవారుగా పోలీసులు తెలిపారు.

## సీఎం సహాయనిధి పేదలకు భరోసా



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

**హనుమాన్‌జంక్షన్,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):** సీఎం సహాయనిధి పేదలకు భరోసాగా నిలుస్తోందని టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. సీఎం సహాయనిధి నుంచి వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన పలువురు బాధితులకు చెక్కులను సోమవారం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. షేక్ ముబాషిరాకు రూ.45, 786లు వేమూరి సుధారాణి రూ. 27, 219లు, గూడపాటి గంగాభవాని రూ.37, 378లు, దయాల అజయ్‌కుమార్ రూ.38 వేలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మిక్కిలినేని మురళీ, యలమంచిలి వెంకటేశ్వరరావు, పొట్లూరి ఫణి తదితరులు ఉన్నారు.

## భారీ వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన




ప్రొద్దుటూరులో నేలకొరిగిన అరటి తోటను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి హరిశ్చంద్

**కంకిపాడు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని ఈడుపుగల్లు, ప్రొద్దుటూరు, దావులూరు గ్రామాలతో పాటు పెనమలూరు మండలంలోని పెనమలూరు, పోరంకి గ్రామాల్లో హార్టికల్చర్ అధికారి హరిశ్చంద్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి కంకిపాడు, పెనమలూరు మండలంలోని వివిధ గ్రామాల్లో పంట పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం పక్షాన వీలైనంత త్వరగా సహాయ చర్యలు చేపడతామని తెలియజేశారు.

## పంటకోత ప్రయోగాలపై వీఏఏలకు శిక్షణ

**ఉంగుటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :** పంటకోత ప్రయోగాలు పారదర్శకంగా నిర్వహించడం ద్వారా పంట దిగుబడులు కచ్చితంగా అంచనా వేయవచ్చునని ఏవో గద్దె రమేష్ అన్నారు. వరిలో పంటకోత ప్రయోగాలపై సోమవారం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో వీఏఏలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పంటకోత ప్రయోగాలు విధి విధానాలపై వీఏఏలకు దిశా నిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో కె.రత్నారావు, ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

## చెరకులో తీగజాతి కలుపు మొక్కల నివారణ చేపట్టాలి



**ఉయ్యూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :** చెరకు పంటలో తీగజాతి కలుపు మొక్కలు, వరిలో ఆకుముడత పురుగు, పొడతెగులు ఉధృతి అధికంగా ఉన్న పరిస్థితుల్లో రైతులు నివారణ చర్యలు చేపట్టాలని కేవీకే సమ న్వయకర్త డాక్టర్ సుధారాణి సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఘంటసాల శాస్త్ర వేత్తల బృందం సోమవారం గండిగుంటలో వరి, చెరకు పొలాలను పరిశీ లించారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త రేవతి, సస్యపోషణ శాస్త్రవేత్త వెంకట లక్ష్మి, మణిమాల పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఒకరి మృతి

**ఉయ్యూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :** మచిలీపట్నం- విజయవాడ జాతీయ రహదారిపై గండిగుంట సమీపాన సోమవారం రాత్రి రోడ్డు దాటుతున్న విన్నకోట శ్రీరాములును కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉయ్యూరుకు చెందిన విన్నకోట శ్రీరాములు (62) గంగూరు సమీపాన ఓ కంపెనీలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీ ముగించుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా పెట్రోల్ అయిపోవడంతో గండిగుంటవద్ద పక్కన నిలిపి రోడ్డుకు అవతలి వైపు నున్న పెట్రోల్ బంకుకు వెళ్లి బాటిల్‌లో పెట్రోల్ పోయించుకుని తిరిగి వస్తుండగా ఉయ్యూరు వైపు నుంచి విజయవాడవైపు వెళుతున్న కారు ఢీకొని అక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

**ఉంగుటూరు,సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :** ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వుండాలని ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని నారయ్యఅప్పారావుపేటలో సోమవారం సర్పంచ్ ఎన్.నాగరాజుతో కలిసి గ్రామంలో పర్యటించారు. పంచాయతీ పైపులైన్ల లీకేజీలు, ఆర్వో ప్లాంటు నీటినాణ్యత, రక్షితనీటి సరఫరా పథకం ఓవర్‌హెడ్ ట్యాంకులో క్లోరినేషన్ ప్రక్రియ పరిశీలించి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్-5 సెక్రటరీ అమూల్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దాలినాయుడు పాల్గొన్నారు.

# కావలసినంత యూరియా సరఫరా చేస్తాం

### రైతులతో కలెక్టర్ డీకే బాలాజీ



పురుషోత్తపట్నంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

**గన్నవరం, 22 సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి):** రైతులకు కావలసినంత యూరియా పంపిస్తామని, ఎవరూ కూడా ఆందోళన చెందవద్దని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని పురుషోత్తపట్నం యూరియా సరఫరా ఇఫ్కో గిడ్డంగిని సోమవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆ గ్రామ రైతులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ఇప్పటివరకువరి పంటకు రెండు సార్లు యూరియా వేసామని ఇంకా మూడో డోసుకు యూరియా అవసరముందని, దసరా పండుగ అయిన తర్వాత యూరియా అందజేస్తే బాగుంటుందని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో కలెక్టర్ వెంటనే స్పందిస్తూ చివరిసారిగా ఎప్పుడు ఎన్ని బ్యాగులు వచ్చాయని ప్యాక్స్ గుమాస్తా అనుషాను ప్రశ్నించగా ఈ నెల 16వ తేదీన 15 టన్నుల దాకా యూరియా వచ్చిందని సమాధానం చెప్పారు. అందుకు సంబంధించిన రికార్డులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ వారం రోజుల్లో యూరియాను తప్పకుండా సరఫరా చేస్తామని ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. తహసీల్దార్ కేవీ శివయ్య పాల్గొన్నారు.

### రోడ్డుపై చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోండి

**కంకిపాడు:** గన్నవరం రోడ్డులో ఉప్పలూరు బుడమేరు వద్ద చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ ఆదేశించారు. గన్నవరం నుంచి కంకిపాడు వస్తున్న ఆయన సోమవారం ఉప్పలూరులోని బుడమేరు కాలువ పక్కన రోడ్డుపై వేసిన చెత్తను పరిశీలించారు. తక్షణం ఉప్పలూరు పంచాయతీ అధికారులను ఫోన్ చేసి పిలిపించారు. రోడ్డు మార్జిన్‌లో చెత్త వేయడాన్ని ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. రోడ్డుపై చెత్త ఎవరు వేశారు అంటూ నిలదీశారు. రోడ్డుపై విజయవాడ నుంచి వచ్చి కొంత మంది చెత్త వేస్తున్నారంటూ పంచాయతీ ఈవో వెంకటేశ్వరరావు ఆయన ఫోన్‌లో రికార్డు చేసిన ఫొటోలను చూపించారు. దీంతో అర్ధరాత్రి పూట గన్నవరం రోడ్డులో బుడమేరు వద్ద చెత్త వేస్తున్న వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.



## యనమలకుదురును మరింత అభివృద్ధి చేస్తా

### రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

**పెనమలూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):** తాడిగడప మునిసి పాలిటీలోని యనమలకుదురును అభివృద్ధి చేసి తీరుతామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. సోమవారం సాయంత్రం రూ. 1.52 కోట్లతో నిర్మించనున్న యనమలకుదురులోని ఇంద్రకీలాద్రి నగర్ 1, 2, 3 రోడ్లతో పాటు ప్రధాన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, అనంతనేని ఆజాద్, తాతపూడి గణేష్, యేకుల విజయేంద్ర, మల్లంపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అధ్వానంగా కందలంపాడు ప్రధాన రహదారి

## మరుగున పడుతున్న పల్లె ప్రాంతాలు

### అభివృద్ధికి దూరంగా కందలంపాడు

**కంకిపాడు, సెప్టెం బరు 22 (ఆంధ్రజ్యోతి):** గతంలో ఒక వెలుగు వెలిగిన పల్లె ప్రాంతాలు ప్రాచుర్యాన్ని కోల్పోతు న్నాయి. అభివృద్ధి లేక గ్రామంలోని యువత గ్రా మాలు వదిలి వెళ్లిపోతు న్నారు. ఆయా గ్రామాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కలిగిన అధికారులు, ప్రజా ప్రతినిధులు అటుగా అడుగులు వేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని కందలం పాడు ఒకప్పుడు కుందేరు పంచాయతీలో విలీ నమై ఉండేది. అనంత రం జరిగిన పంచాయతీ విభజన కార్యక్రమంలో కుందేరు నుంచి కందలంపాడు గ్రామ పంచాయతీగా రూపాంతరం చెందింది. అంతే అక్కడ నుంచి కందలంపాడు అభివృద్ధికి దూరమైంది. వెనుకబడిన వర్గానికి చెందిన సుమారు 200 వందలకు పైగా నివాసముంటున్నారు. వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

**అధ్వానంగా ప్రధాన రహదారులు**

కుందేరు నుంచి కందలంపాడుకు రెండు కిలో మీటర్ల దూరం ఉంటుంది. అదే కాకుండా కందలంపాడు నుంచి కుందేరు, కాటూరు, మానికొండ వంటి ప్రధాన గ్రామాలు కిలో మీటర్ నుంచి రెండు, మూడు కిలో మీటర్లు దూరంగా ఉంటాయి. కందలంపాడు వెళ్లేందుకు ఉన్న ప్రధాన రహదారి అత్యంత అధ్వానంగా ఉన్నా పట్టించుకునే వారే కరువయ్యారు. అటు అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణం రహదారి నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కానూరు సిద్దార్థ వర్సిటీలో నృత్యం చేస్తున్న వీసీ, ప్రొ. వీసీ, రిజిస్ట్రార్

## వైభవంగా స్టెప్ అండ్ స్పిన్-2025

- గర్బా నృత్యం చేసిన వీసీ, ప్రొ. వీసీ, రిజిస్ట్రార్..
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

**కానూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):** కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో సోమవారం స్టెప్ అండ్ స్పిన్- ఫన్ ఫిల్డ్ డాన్స్ ఈవెంట్ వైభవంగా జరిగింది. వర్సిటీ సంస్కృతి, కల్చరల్ అండ్ లిటరరీ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఈవెంట్‌లో వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రొ. వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్‌తోపాటు పలువురు ఫ్యాకల్టీ సభ్యులు గుజరాతీ స్టైల్‌లో చేసిన గర్బా నృత్యం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వర్సిటీలో చదివే విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని డీజే, మ్యూజిక్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దాండియా, కోలాటం, గర్బా వంటి సంప్రదాయ నృత్యాలతో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ముందుగా కార్యక్రమాన్ని వీసీ వెంకటేశ్వరరావు జ్యోతిని వెలగించి ప్రారంభించారు. కార్యక్రమంలో కల్చరల్ కమిటీ కన్వీనర్ బి. నీలాంబరం, కో-కన్వీనర్ డాక్టర్ పావని పాల్గొన్నారు.



కడవకొల్లులో సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

## సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తి

**ఉయ్యూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. కడవకొల్లులో సోమవారం పర్య టించి సీఎం చంద్రబాబు అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలపై ప్రచారం చేసి పథకాలపట్ల ప్రజల మనోగతాలను తెలుసుకున్నారు. స్త్రీశక్తి పథకం అమలు చేసి మహిళలకు ఆర్టీసీ బస్సులలో రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత ప్రయాణం కల్పించడం పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ చంద్రబాబుకు అండగా నిలుస్తామంటున్నారని పేర్కొన్నారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కుప్పాల అంజిబాబు, జయరాజు, రామకృష్ణ, చిట్టిబాబు. జొన్నలగడ్డ నాని తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో ఉత్సవాలు ప్రారంభిస్తున్న దాసరి బాలవర్ధనరావు, ఆత్కూరులో.. జంక్షన్‌లో.. రంగన్నగూడెంలో

# వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**గన్నవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :** మండలంలో శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పాత గన్నవరం లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు జ్యోతి వెలిగించి మహోత్సవాలను ప్రారంభించారు. కాసన్నేని బాబూరావు, బేబీ సరోజిని దంపతులచే కలశస్థాపన జరిగింది. జాస్తి నాగేశ్వరరావు, అనంతలక్ష్మి దంపతులు తొలిరోజు అమ్మవారికి వస్త్రలంకరణకు చీర అందజేశారు. గాయత్రి మందిరంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కేవీఆర్ కిషోర్ ఆధ్వర్యంలో మహోత్సవాలు ప్రారంభ మయ్యాయి.

**ఉంగుటూరు :** శ్రీదేవి శరన్నవ రాత్రుల మహోత్సవాలు మండలవ్యాప్తంగా వివిధ ఆలయాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆత్కూరు, పెదఅవుటపల్లి, మానికొండ, లంకపల్లి, తేలప్రోలు, నాగవరప్పాడు ఆలయాల్లో అమ్మవారు తొలిరోజు శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్కూరు శ్రీకనకదుర్గా అమ్మవారి ఆలయంలో పెద్దసంఖ్యలో భక్తులు మాలలు వేసుకుని భవానీ దీక్ష స్వీకరించారు.

**హనుమాన్‌జంక్షన్ :** దసరా మహోత్సవాల్లో భాగంగా పలు దేవాలయాల్లో సోమవారం దేవీ నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరిదేవిని వైష్ణవిదేవిగా అలంకరించి అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని వాసవీ కల్యాణ మండపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని బాలాత్రిపురసుందరిగా పూజించారు. బాపులపాడు శివాలయంలో భ్రమరాంబికా దేవిని బాలత్రిపుర సుందరీగా అలంకరించి, పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వి.సురేష్ ఆధ్వర్యంలో విజయ దశమి పూజలు ప్రారంభించారు.



గండిగుంటలో.. ఈడుపుగల్లులో

**హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** రంగన్నగూడెం, మల్లవల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో దసరా శరన్నవాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రంగన్నగూడెంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలో మెరుగుమాల రాజు దంపతులు పాల్గొన్నారు. మల్లవల్లిలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా అక్కినేని కృష్ణాజీ, హేమలత దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కొత్తపల్లి, ఆరుగొలను, బిళ్లనపల్లి, వేలేరు, మడిచర్లల్లో దసరా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

**ఉయ్యూరు :** స్థానిక జగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శరన్న వరాత్రి వేడకల్లో భాగంగా మొదటి రోజ అమ్మవారు రజత కవచాలంకృత జగదాంబదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గండిగుంట వంశీ రాయల్ సిటీ ఆవరణలో దశరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల వెంకట సాంబశివరావు దంపతులు పూజలో పాల్గొన్నారు.

**కంకిపాడు :** ఈడుపుగల్లులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా, అనీల్ సందర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంకిపాడు శివాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శన మిచ్చారు.

## 25న డీఎస్సీ సభ.. పవన్‌కు లోకేశ్ ఆహ్వానం

అమరావతి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసే డీఎస్సీ సభను ఈ నెల 25న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సభకు హాజరు కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ ఆహ్వానించారు. సోమవారం అసెంబ్లీలో పవన్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. గత ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టునూ భర్తీ చేయకపోగా, మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు ప్రత్యర్థులు 106 కేసులు వేశారని వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుందన్నారు. దీనివల్ల ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కలలు సాకారమయ్యాయని తెలిపారు.

## ప్రైవేటు డిగ్రీ కాలేజీల బంద్

» ఫీజు బకాయిల కోసం యాజమాన్యాల డిమాండ్

ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘం సోమవారం నుంచి సమ్మెలోకి దిగింది. పలు యాజమాన్యాల పరిధిలోని కాలేజీలు.. విద్యా సంస్థలను మూసివేసి బంద్‌కు మద్దతు తెలిపాయి. ఈ నెల 27 వరకు బంద్ కొనసాగిస్తామని సంఘం ప్రతినిధులు కె.గుండారెడ్డి, పి.జయరాం, పి.పెద్దిరోజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెలవుల అనంతరం అక్టోబరు 6 నుంచి విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామన్నారు. గత 16 నెలలుగా ఫీజు బకాయిలు విడుదల చేయలేదని, దీంతో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేకపోతున్నామని తెలిపారు. బంద్‌కు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, యూఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు మద్దతు తెలిపాయన్నారు.

## రేపు వైసీపీ సమన్వయకర్తలతో జగన్ భేటీ

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ వైసీపీ సమన్వయకర్తలతో సమావేశం కానున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేసే ఉద్దేశంతో.. బుధవారం మధ్యాహ్నం తాడేపల్లి ప్యాలెస్‌లో ఏర్పాటుచేసిన ఈ భేటీకి 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల సమన్వయకర్తలు హాజరవుతారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కూడా రావాలని జగన్ ఆదేశించారు. వాస్తవానికి ఆయన బుధవారం విలేకరుల సమావేశం పెట్టాలనుకున్నారు. అదే రోజు శాసనమండలిపై మెడికల్ కాలేజీలపై చర్చ జరగనుండడంతో గురువారానికి వాయిదా వేసుకున్నారు.

## జీఎస్టీ సంస్కరణలు విప్లవాత్మక మార్పు: జగన్

జీఎస్టీ 2.0 సంస్కరణలను సరళమైన పన్ను వ్యవస్థగా, విప్లవాత్మకమైన మార్పుగా వైసీపీ అధ్యక్షుడు జగన్ అభివర్ణించారు. వస్తుసేవలు.. పన్నుల సరళీకృత విధానం ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని.. జీఎస్టీ శ్లాబుల సవరణతో ప్రజలకు మేలు కలుగుతుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ ట్వీట్‌పై రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ తీవ్రంగా స్పందించారు. ఇన్నేళ్లుగా మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులను పెంచేసి జనాలను దోచుకున్న విషయంపై ఎందుకు మాట్లాడలేదని జగన్‌ను 'ఎక్స్' వేదికగా నిలదీశారు. ప్రజలపై మోదీ మోయలేనంతగా భారాలను వేస్తుంటే ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. కేసులకు భయపడే ఆయన్ను విమర్శించేందుకు జగన్ భయపడుతున్నారని పేర్కొన్నారు.

## జాషువా జయంతి ఘనంగా నిర్వహిద్దాం: మాధవ్

మహాకవి గుర్రం జాషువా జయంతిని రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని ఏపీ బీజేపీ నిర్ణయించింది. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, 'సెప్టెంబరు28న జాషువాజయంతి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలి. విజయవాడలో ఆయనను ఘనంగా గుర్తు చేసుకోవాలి. గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించి తెలుగు నేలకే వన్నెతెచ్చిన ఆధునిక తెలుగు కవి ఆదర్శాల గురించి ఈ తరానికి తెలియజెప్పాల్సిన బాధ్యత ఉంది' అని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ ఆర్డీ విల్సన్, ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, పలువురు నేతలు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలంకరణతో కాంతులీనుతున్న తిరుమల శ్రీవారి ఆలయం

### బ్రహ్మోత్సవాల్లో

# సామాన్యులకే ప్రాధాన్యం

» అన్ని విభాగాల సమన్వయంతో సమగ్ర ప్రణాళిక

» మాడ వీధుల్లో భక్తుల భద్రతకు పెద్దపీట

» నిఘాపై రియల్ టైం మానిటరింగ్

» 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్



(తిరుమల-ఆంధ్రజ్యోతి)

కలియుగ వైకుంఠం తిరుమల బ్రహ్మోత్సవ సంరంభానికి సిద్ధమైంది. లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా శ్రీవేంకటేశ్వరస్వామి వారి దర్శనం కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేశామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రణాళిక మేరకు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న వివరాలు..

### ఎలాంటి ఇబ్బందులు లేకుండా..

తిరుమల పవిత్రత కాపాడుకుంటూ సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దానికి అనుగుణంగా బోర్డు సభ్యులు, అధికారులందరం కలిసి నిర్ణయాలు తీసుకున్నాం. ఎస్ఎస్‌డీ (స్లాటెడ్ సర్వదర్శనం) టోకెన్ల కోటా పెంపుతో పాటు ఆన్‌లైన్ రూ.300 దర్శన టికెట్లు అధికంగా ఇచ్చాం. నేరుగా తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకే అధిక సంఖ్యలో గదులు కేటాయించేలా చర్యలు చేపట్టాం. వాహన సేవలు వీక్షించేందుకు మాడవీధుల్లోకి వచ్చే, వెలుపల ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదాల వితరణ, 110 మందితో వైద్య సేవలు అందించేలా ప్రణాళికలు రూపొందించాం. పారిశుధ్యానికి పెద్దపీట వేయడంతో పాటు సరిపడా తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేశాం.

### పటిష్ఠ భద్రత

సెక్యూరిటీ పేరుతో మాడ వీధుల్లోకి భక్తులు ప్రవేశించే సమయంలో ఇబ్బందులు పెట్టకూడదని నిర్ణయించాం. భద్రత కల్పనలో లోపాలు లేకుండా దాదాపు 6 వేల మందితో సేవలందించాలని ఆదేశాలిచ్చాం. గరుడ సేవ రోజు అదనంగా మరో 1,300 మంది బందోబస్తులో భాగస్వాములు కానున్నారు. దాదాపు 3 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. వీటిద్వారా రియల్ టైంలో మానిటర్ చేస్తాం. కమాండ్ కంట్రోల్ రూం నుంచి అన్నిటినీ నిరంతరాయంగా పరిశీలిస్తుంటారు.

### సమన్వయ లోపాలకు చెక్

టీటీడీ, పోలీసు, విజిలెన్స్ అధికారులతో కొన్ని బృందాలను ఏర్పాటు చేశాం. వారు మాడ వీధుల్లోని గ్యాలరీల వద్ద సెక్టార్ల వారీగా విధులు నిర్వహిస్తారు. భక్తులతో నేరుగా మాట్లాడతారు. ముందస్తు ప్రణాళికలను అమలుచేస్తారు. శ్రీవారి సేవకులు కూడా గ్యాలరీల్లోనే ఉంటూ భక్తులకు సేవలందించడంతో పాటు ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొస్తారు. ఈసారి సమన్వయ లోపానికి ఆస్కారం లేదు.

### 4 వేల వాహనాలకు పార్కింగ్ సిద్ధం

4 వేల వాహనాలకు సరిపడా పార్కింగ్ ప్రదేశాలను తిరుమలలో సిద్ధం చేశాం. అంతకు మించి వస్తే తిరుపతిలోని పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తాం. వారికి ఆయా ప్రదేశాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ 1,900 ట్రిప్పులు, గరుడ సేవ రోజున మూడు వేల ట్రిప్పులను తిప్పేందుకు ఆర్టీసీ ప్లాన్ చేసింది.

### పూర్వ జన్మ సుకృతం

రెండవసారి టీటీడీ ఈవోగా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు. ఒక్కసారి ఈవో కావడమే పూర్వ జన్మ సుకృతంగా భావిస్తారు. అలాంటిది నేను రెండోసారి ఈవో అయ్యాను. మొదటిసారి ఈవోగా నియమితమైనప్పుడు చాలా మంది నార్త్ ఇండియన్, సౌత్ ఇండియన్ అంటూ చర్చలు పెట్టారు. కానీ రెండోసారి ఈవోగా వస్తుంటే చాలా మంది స్వాగతించారు. ఇప్పటికే నాలుగు బ్రహ్మోత్సవాలు పూర్తిచేసిన అనుభవంతో ఐదో బ్రహ్మోత్సవాన్ని వైభవంగా, వివాదరహితంగా నిర్వహిస్తాననే గట్టి నమ్మకముంది.

### శ్రీవారి బ్రహ్మోత్సవాలకు

## నేడు అంకురార్పణ

తిరుమల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరుగనుంది. సాయంత్రం ఆలయంలో సేనాధిపతి విష్వక్సేనుడిని అలంకరించి తిరుచ్చిపై నాలుగు మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఆయన బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించిన తర్వాత రంగనాయక మండపంలో ఆస్థానం నిర్వహిస్తారు. అనంతరం యాగశాలలో అర్చక స్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ (బీజవాపం) నిర్వహిస్తారు. దీంతో స్వామివారి బ్రహ్మోత్సవ వేడుకలు మొదలవుతాయి. ఇక, బుధవారం సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణం జరుగుతుంది. రాత్రి పెద్ద శేష వాహనంతో బ్రహ్మోత్సవాల వాహన సేవలు ప్రారంభమవుతాయి. కాగా, శీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

### రేపు తిరుమలకు ఉప రాష్ట్రపతి

ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం తిరుమలకు రానున్నారు. ఉప రాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ బుధవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి రోడ్డుమార్గాన తిరుమల చేరుకుంటారు. రాత్రికి తిరుమలలో బసచేసి మరుసటి రోజు శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు.

### కార్నర్ పాయింట్స్ నుంచి దర్శనం

మాడ వీధుల్లోని గ్యాలరీల్లో 1.80 నుంచి దాదాపు 2 లక్షల మంది కూర్చుని వాహన సేవలను వీక్షించే అవకాశముంటుంది. రెండేళ్ల నుంచి మాడవీధుల్లోని నాలుగు కార్నర్ పాయింట్ల నుంచి భక్తులను క్యూలైన్ ద్వారా అనుమతించి దర్శనం కల్పిస్తున్నాం. అయితే గతేడాది ఇలా క్యూలైన్‌లోకి ప్రవేశించే సమయంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. ఈసారి 45 నిమిషాల పాటు వాహనాన్ని కార్నర్ పాయింట్లలో ఉంచి హోల్డింగ్ పాయింట్ల ద్వారా భక్తులను అనుమతించి దర్శనం చేయిస్తాం. గతేడాది ఈ పాయింట్ల ద్వారా 16 వేల మందికి దర్శనం చేయిస్తే ఈసారి దాదాపు 30 వేల మందికి దర్శనం చేయించేలా ప్రణాళిక రూపొందించాం.

## చిన వెంకన్నకు రూ.కోటి విరాళం



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 22(ఆంధ్ర జ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో కొలువైన శ్రీవారి ఆలయంలో అద్దాల మండపం నిర్మాణానికి రూ.కోటి విరాళం సోమవారం అందింది. అనకాపల్లికి చెందిన ఫారెస్ట్ రేంజ్ విశ్రాంత అధికారి బొండాడ కొండలరావు ఈ విరాళం చెక్కును ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణ మూర్తికి అందజేశారు. దాతను ఈవో సత్కరించారు.

## శ్రీవారికి రూ.1.8 కోట్ల బంగారు పతకాలు





తిరుమల: తిరుమల శ్రీవారికి సోమవారం రూ.1.8 కోట్ల విలువైన బంగారు పతకాలు, వెండి తట్టలను శ్రీసంస్థాన్ గోకర్ణ పర్తగాళి జీవోత్తమ మఠాధిపతి విద్యాధీశతీర్థ స్వామిజీ విరాళంగా అందజేశారు. ఆలయంలో టీటీడీ పేష్కార్ రామకృష్ణకు 15 బంగారు పతకాలు, రెండు వెండి తట్టలను అందజేశారు.





## మరో రూ.కోటి విలువైన పతకాల విరాళం

తిరుమల: చెన్నైకు చెందిన ఓ అజ్ఞాత భక్తుడు సాధారణ రాళ్ల పొదిగిన తొమ్మిది బంగారు పతకాలను శ్రీవారికి విరాళంగా అందజేశారు. సుమారు రూ.కోటి విలువైన వీటిని సోమవారం శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంలో అధికారులకు అందజేశారు. వీటిని శ్రీవారి ఉత్సవమూర్తులకు అలంకరించనున్నారు.

## శైలపుత్రిగా భ్రమరాంబ దర్శనం



శ్రీశైలం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు భ్రమరాంబికా అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్లు విహరించారు.



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

## అర్జీలను సత్వరం పరిష్కరించాలి: డీఆర్వో

మచిలీపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చిన అర్జీలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని డీఆర్వో కే చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో సోమవారం అధికారులతో కలిసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలపై ఇచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు. నిర్థిత సమయంలోగా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. ఐగాట్ కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులను ఉద్యోగులంతా సకాలంలో పూర్తి చేయాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించిన ఫైళ్లకు త్వరగా కౌంటర్ దాఖలు చేయాలన్నారు. ప్లాస్టిక్ నివారణకు స్టీలు బాటిళ్లను అందిస్తున్నామన్నారు. డెప్యూటీ కలెక్టర్లు శ్రీదేవి, పోతురాజు, ఆర్డీవో కే స్వాతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### త్వరితగతిన పరిష్కరిస్తాం: ఏఎస్పీ



మచిలీపట్నం క్రైమ్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం లో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కారం చేయాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వీవీ నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని ఫిర్యాదుదారుల సమస్యలు విని వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా 52 మంది ఫిర్యాదుదా రులు తమ సమస్యలను అడిషినల్ ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలపై స్పందించిన ఆయన సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఫిర్యాదులను రిఫర్ చేయటంతో పాటు ఆఫీసర్లతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. పరిష్కారం కాని సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సమ్మె నోటీసు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు సోమవారం కలెక్టరుకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి సమ్మె నోటీసులు అందజేశారు. ఏపీ ప్రాథమిక హెల్త్ సెంటర్ల డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎంఆర్ కుమార్ నాయకత్వంలో జిల్లా అధికారులకు సమ్మె నోటీసులిచ్చారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం దిగిరాకపోతే సమ్మెకు సిద్ధంగా ఉన్నామన్నారు.

### గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా

## కలిసిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



మచిలీపట్నం క్రైమ్ సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి గవర్నర్ అబ్దుల్ నజీర్ వచ్చిన సందర్భంలో జిల్లా ఎస్పీ ఆయన్ను కలుసుకున్నారు. గవర్నర్‌కు ఆయన పూలమొక్కను అందించారు. కృష్ణా జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తరువాత గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలుసుకోవటం ఎస్పీకి ఇదే తొలిసారి.

# సంగమంలో విజయనర్తనం

### అంగరంగ వైభవంగా ప్రారంభమైన సాంస్కృతికోత్సవం

- పవిత్ర సంగమానికి భారీగా తరలివచ్చిన జనసందోహం
- దసరా ఉత్సవాల సందర్భంగా సంగమ ప్రాంతంలో ఉత్సవాలు
- ప్రతిరోజూ అమ్మవారి అలంకారాలతో ప్రత్యేక పూజలు
- సాయంత్రం వీనులవిందైన సాంస్కృతిక ప్రదర్శనలు
- కొండపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ధూమ్‌ధామ్‌గా వేడుకలు





విజయవాడ కల్చరల్/ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దసరా మహోత్సవాలను పురస్కరించుకుని పవిత్ర సంగమంలో కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విజయనర్తనం' సాంస్కృతిక ప్రదర్శనలు అంగరంగవైభవంగా ప్రారంభమైంది. భారీగా వచ్చిన వీక్షకులకు కనువిందైన సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి, భరత నాట్యాలు, జానపద నృత్యాలు మైమరపించాయి. నాట్యాచార్య సప్పా శివకుమార్ బృందం, మావులూరి త్రినాథాచారి, పావని, నరేంద్ర విద్యార్థులు ప్రదర్శించిన నాట్యంశాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. పవిత్ర సంగమంలో అమ్మవారిని ఈరోజు బాలా త్రిపుర సుందరగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయనర్తనం పేరిట దసరా సాంస్కృతిక ఆధ్యాత్మిక మహోత్సవాలు అక్టోబరు 2 వరకు జరుగుతాయని కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్యకీర్తన చెప్పారు. ఈ ఉత్సవాలను సోమవారం సాయంత్రం మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చరిత్రలో ఎప్పుడూ జరగనంత గొప్పగా ఎన్టీఆర్ జిల్లాలో దసరా ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. దేశ సంస్కృతికి ఆచారాలకు కళలే చిహ్నాలన్నారు. కలలను ప్రోత్సహించడం వల్ల మన సంస్కృతిని వారసత్వానికి అందించినవాళ్లమవుతున్నామన్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికిలపూడి శ్రీనివాసరావు, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కొండపల్లి మున్సిపాలిటీ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు.

## కొండాలమ్మ సన్నిధిలో దసరా ఉత్సవాలు ప్రారంభం



గుడ్లవల్లేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం ఉదయం విఘ్నేశ్వర పూజతో దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 10.12 నిమిషాలకు ఉత్సవ కలశ స్థాపనను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించగా రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జగన్మోహనరావుచే కలశ స్థాపన నిర్వహించారు. అనంతరం పుణ్యాహవాచన, పీఠార్చన, దీక్షాధారణ, సహస్రనామార్చన, అగ్నిప్రతిష్ఠాపన, లక్ష్మీ గణపతి సహిత నవగ్రహ హవనములను నిర్వహించారు. పూజలను ఈవో ఆకుల కొండలరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహన రావు, గుడివాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టరు ఎస్ శోమేశ్వరరావు దంపతులు, ధర్మకర్తల దంపతులచే నిర్వహించారు. రావి వెంకటేశ్వరరావు, జగన్మోహనరావును, సీఐ సోమేశ్వరరావు దంపతులను చైర్మన్ మోహన్, ఈవో కొండలరావు సన్మానించి అమ్మవారి చిత్రపటాలను, ప్రసాదం బహూకరించారు. ఆలయ ధర్మకర్తలు తూము రాజ్యలక్ష్మి, గుడ్లవల్లేటి వాణి, ముగం ఆంజనేయిలు, కళ్లేపల్లి సుగుణశేఖర్, మన్నెం వీరనాగేంద్రరావు, వడ్లమూడి రవీంద్రబాబు, పెద్దుబోయిన శ్యామలా దేవి, నూతులపాటి లక్ష్మీపావని, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అర్చకుడు రుద్రపాటి శరత్చంద్ర శివ సంతోష్ శర్మ, కూటమి నేతలు పాల్గొన్నారు.

## జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగానికి ఊతం

● వరుణ్ గ్రూప్ డైమండ్ జూబ్లీ వేడుకల్లో సీఎం చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో ఆటోమొబైల్ రంగం మరింత అభివృద్ధి చెందడానికి ఉపకరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. వరుణ్ గ్రూప్ డైమండ్ జూబ్లీ వేడుకలు సోమవారం విజయవాడలోని వరుణ్ నోవాటెల్‌లో జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రబాబు మాట్లాడుతూ ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేశామని, భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఒక సంస్థ 75 ఏళ్ల ప్రస్థానమంటే చాలా గొప్ప విషయమన్నారు. 'కృష్ణా జిల్లా వాళ్లు తెలివైన వారు. ఒకప్పుడు విజయవాడ నగరం ఎంతో మంది గొప్పవారిని ప్రపంచానికి అందించింది. ఇక్కడున్న గొప్పవారంతా ప్రపంచమంతా వివిధ రంగాల్లో విస్తరించారు. అమరావతి నిర్మాణంతో మళ్లీ ప్రపంచంలో ఉన్నవారంతా తిరిగి ఇక్కడికి వస్తారన్న నమ్మకం ఉంది. అమరావతి అభివృద్ధికి తోడ్పడతారన్న నమ్మకం ఉంది.' అని చంద్రబాబు పేర్కొన్నారు. వరుణ్ గ్రూప్ అధినేత ప్రభు కిశోర్ జీవిత చరిత్ర ద విన్నరియన్ పుస్తకాన్ని సీఎం ఆవిష్కరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు, సీఎం సతీమని భువనేశ్వరి పాల్గొన్నారు.

### ప్రతి ఏడాది 7లక్షల మంది పేదలకు వైద్యసేవలు: చైర్మన్ ప్రభుకిషోర్



భారతీనగర్: వరుణ్ గ్రూప్ వ్యాపార రంగంతో పాటు సామాజిక సేవలో నూ ముందుంటుంది. అందులో భాగంగా ప్రతి ఏడాది 7లక్షల మంది పేదలకు ఉచిత వైద్యం అందిస్తోందని వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ అన్నారు. వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్, మేనేజింగ్ డై రెక్టర్ వరుణ్ దేవ్, జాయింట్ ఎండీ వర్ష పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి వరుణ్ గ్రూప్ 75వ వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. చైర్మన్ ప్రభుకిషోర్ మాట్లాడుతూ వరుణ్‌గ్రూప్ తన అద్భుతమైన 75 ఏళ్లు విశిష్టమైన వైభవంగా కొనసాగుతుందన్నారు. ఎండీ వరుణ్‌దేవ్ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు నవరత్నం, కేశవరావు స్మారకార్థం ప్రభుకిషోర్ రాష్ట్రవ్యాప్తంగా హెల్త్‌సెంటర్లు స్థాపించారని, ప్రస్తుతం 9 హెల్త్ సెంటర్లు ఉన్నాయన్నారు.

## విజయవాడ ఉత్సవ్‌కు సుప్రీం గ్రీన్ సిగ్నల్

● విజయవాడ ఉత్సవ్‌కు ఆలయ భూముల వినియోగంపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని తలపెట్టిన 'విజయవాడ ఉత్సవ్'కు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ భూములతో సంబంధం లేని వ్యక్తులకు అక్కడ నిర్వహించే ఉత్సవాలపై అభ్యంతరం ఎందుకుంటూ సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. వ్యవసాయ భూములైతే రాష్ట్ర ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులు చూసుకుంటారని సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చి చెప్పింది. విజయవాడ శివారు గొల్లపూడిలో మచిలీపట్నం గొడుగుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం వ్యవసాయ భూములను 'విజయవాడ ఉత్సవ్' పేరిట వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని బూరుగడ్డ సుజయ్ కుమార్, ఎన్ అయోధ్య రామచంద్రరావు హైకోర్టును ఆశ్రయించారు. ఆలయ వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించవద్దని హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. సింగిల్ జడ్జి తీర్పుపై హైకోర్టు సీజే ధర్మాసనం స్టే విధించింది. హైకోర్టు సీజే ధర్మాసనం తీర్పును సుజయ్ కుమార్‌తోపాటు అయోధ్య రామచంద్రరావు సెప్టెంబర్ 19న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.ఆ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో కూడిన ద్విసభ్య ధర్మాసన విచారించింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు రంజిత్ కుమార్, నచికేత జోషి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం హైకోర్టు సీజే ధర్మాసనం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో జోక్యానికి కారణాలేమీ కనిపించడం లేదని చెబుతూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

### ఎగ్జిబిషన్ నిర్వహణకు తొలగిన అడ్డంకులు: ఎంపీ



ఇబ్రహీంపట్నం: సుప్రీం కోర్టు తాజా ఆదేశాల నేపథ్యంలో గొల్లపూడి ఎగ్జిబిషన్ మైదానంలో ఉత్సవాల నిర్వహణకున్న అడ్డంకులన్నీ పూర్తిగా తొలగిపోయాయని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఐజీఎం స్టేడియంలో హెలికాప్టర్ రైడ్ ఏర్పాట్లను ఆయన సోమవారం స్వయంగా పరిశీలించి మీడియాతో మాట్లాడారు. ఈనెల 24 నుంచి ఎగ్జిబిషన్‌తో పాటు వివిధ సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. గిన్నిస్‌బుక్ రికార్డు సాధనకు ఈనెల 28న భారీ కార్నీవాల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఉపశమనం

అమల్లోకి వచ్చిన కొత్త జీఎస్టీ సంస్కరణలతో పేద మధ్య తరగతి, రైతులకు ఉపశమనం లభించనుందని, అలాగే మధ్య తరగతికి లాభంగా మారిందన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 128, 137, 148 |
| చికెన్ విత్ స్కిన్ | 244 |
| చికెన్ స్కిన్‌లెస్ | 254 |



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

## ఇంద్రకీలాద్రి ఉత్సవ కమిటీ సభ్యులుగా పోలాసి, రామధేను

గుడివాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ఉత్సవ కమిటీ సభ్యులుగా గుడివాడకు చెందిన పోలాసి ఉమామహేశ్వరరావు, రామధేను వేణుబాబులు నియమిస్తూ దేవస్థాన శాఖ జీవో జారీ చేసింది. ప్రతిష్ఠాత్మకమైన దసరా ఉత్సవాలకు గుడివాడకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు నియమితులవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.


ఉమా మహేశ్వరరావు


రామధేను వేణుబాబు


మోదీ,నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

## మోదీ, నిర్మలా సీతారామన్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నెక్స్ట్ జనరేషన్ జీఎస్‌టీ కార్యక్రమలో 400 ప్రజోపకరణాలపై జీఎస్టీని ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్‌లు తగ్గించడం వల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని బీజేపీ రాష్ట్ర నేత గవిర్నేని రామారావు పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలో సోమవారం గుడ్లవల్లేరు ప్రధాన కూడలిలో ప్రధాని నరేంద్రమోదీ, నిర్మలా సీతారామన్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేషం నగేష్, అట్లూరి దిలీప్ కుమార్, వైపీసీ ప్రసాద్, మోహనరావు, పెన్నేరు రమేష్, వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


పారిశ్రామిక సందర్శనకు వెళ్లిన ఏఎన్‌ఆర్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు

## ఎంబీఏ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

గుడివాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : వివిధ పరిశ్రమలను సందర్శించడం ద్వారా ఎంబీఏ విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ వస్తుందని ఏఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్ అన్నారు. సోమవారం నందివాడ మండలం, తమిరిశలోని ఉమా స్పిన్ టెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పారిశ్రామిక సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ నందమూరి కృష్ణప్రసాద్, మేనేజర్ నందమూరి అక్షయ్‌లు విద్యార్థులకు దారాల తయారీ, ఎగుమతులు, దిగుమతుల గురించి వివరించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్‌ఆర్‌కే ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, సువర్చల, వి.నాగేంద్రకుమార్, భరత్‌కుమార్, పాల్గొన్నారు.


గుడివాడలో..


గుడివాడ రూరల్‌లో..


కూచిపూడిలో..


పామర్రులో..


పెదపారుపూడిలో..

# బాలా త్రిపుర సుందరీదేవీ నమోస్తుతే..


తోట్లవల్లూరులో..

**దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. తొలిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు.**

గుడివాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజుల నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గౌరీశంకరస్వామి దేవస్థానంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు బాలత్రిపుర సుందరీ అలంకారంలో దర్శనమిచ్చారు.

స్థానిక నీలామహల్ రోడ్డులో వేంచేసియున్న విజయదుర్గ అమ్మవారి దేవస్థానంలో కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

**గుడివాడ రూరల్ :** చిన ఎరుకపాడులో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. దొండపాడులో భారీ ఎత్తున ఉత్సవ పందిళ్లు వేసి అమ్మవారిని ఏర్పాటు చేశారు. చౌటపల్లి, మోటూరు, బొమ్ములూరు తదితర గ్రామాల్లో వందలాది మంది భక్తులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

**కూచిపూడి:** మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చినముత్తేవి అన్నపూర్ణ సమేత సోమేశ్వరస్వామి, కూచిపూడి బాలాత్రిపుర సుందరీదేవి, మొవ్వ భీమేశ్వరస్వామివారి ఆలయాలతోపాటు పెదపూడి, అయ్యంకి, నిడుమోలు, మొవ్వ, కాజ, కోసూరు, భట్లపెనుమర్రు, పెడసనగల్లు తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి మహోత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**కూచిపూడి :** కూచిపూడిలోని బాలాత్రిపుర సుందదేవి అమ్మవారికి రూ.1.50 లక్షల విలువ గల బంగారు, వెండి ఆభరణాలను గ్రామానికి చెందిన భాగవతుల రామతారకం ఇందిరాదేవి దంపతులు సోమవారం ఆలయ అర్చకులకు అందజేశారు. బంగారు ముక్కెర, వెండి మండలాలు, పాదాలు, అభయహస్తం, గజ్జల పట్టాలు బహూకరించారు. దాతలు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**పామర్రు :** గంగాపార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంతోపాటు, అంకమ్మ తల్లి దేవాలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలల్లో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్ని దేవాలయాల్లో తొలిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని బాలత్రిపుర సుందరీ దేవి నమోస్తుతే అంటూ ప్రత్యేక పూజలు చేశారు.

**పెదపారుపూడి :** పెదపారుపూడి మండలంలోని అన్ని గ్రామాల్లో దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వెంట్రప్రగడలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అమ్మవారు మొదటి రోజు బాలాత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

**గుడ్లవల్లేరు :** కౌతవరం గౌతమేశ్వరాలయం, గుడ్లవల్లేరు శ్రీమత్ గంగా పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయం, అంగలూరు అమరేశ్వరస్వామి దేవాలయం, డోకిపర్రు, విన్నకోట, పెసరమిల్లి, వడ్లమన్నాడు శివాలయాలలో, గుడ్లవల్లేరు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆయా ఆలయాలలో పెద్ద సంఖ్యలో భక్తులు దర్శనాలు చేసుకొన్నారు.

**నందివాడ :** దసరా నవరాత్రులలో భాగంగా మండలంలోని పోలుకొండ, తమిరిశ, జనార్ధనపురం, లక్ష్మీనరసింహపురం, కుదరవల్లి గ్రామాలలో మొదటిరోజు అవతారాలలో భాగంగా బాల త్రిపురసుందరి దేవీగా అమ్మవారిని అలంకరించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా కుదరవల్లిలో సీతారామస్వామి దేవస్థానంలో రాజమహేంద్రవరపు నాగరాజు దంపతులు అమ్మవారి విగ్రహాన్ని విరాళంగా అందజేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

**తోట్లవల్లూరు:** తోట్లవల్లూరు శివారు కనకదుర్గమ్మ కాలనీ వద్ద కాలనీ వాసులు ప్రత్యేక పందిరిలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తోట్లవల్లూరు శివాలయంలో దసర ఉత్సవాలు ప్రారంభించారు. అమ్మవారు బాల త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా మొదలయ్యాయి.


నందివాడలో..


ఎంపీ బాలశౌరితో అభివృద్ధిపై చర్చిస్తున్న రామలింగేశ్వరరావు

## అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చాలి

● రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు

కూచిపూడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు అందించి సహకరించాల్సిందిగా మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరిని కలసి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. మచిలీపట్నంలోని ఎంపీ కార్యాలయంలో ఈ మేరకు ఎంపీతో చర్చించారు. అయ్యంకి నుంచి కారకంపాడు, పెదముత్తేవి వరకు 3.7 కిలోమీటర్ల రహదారికి రూ.2 కోట్లు, అలాగే చిన్నముత్తేవిలో అసంపూర్తిగా మిగిలిన గ్రామపంచాయతీ భవనానికి నిధులు, మండలంలోని పలు పాఠశాలలకు మౌలిక వసతులు, మరమ్మతులు, ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు అందించాలని కోరారు. ఈ అభివృద్ధికి సంబంధించిన అంశాలను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు బాలశౌరి తెలిపారు.


దుకాణాదారులతో మాట్లాడుతున్న ఎస్సై సత్యనారాయణ

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడ్లవల్లేరు : దేవీ నవరాత్రి ఉత్సవాలలో కొండాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద ట్రాఫిక్ నిబంధనలను ఆలయ సమీప దుకాణదారులు, భక్తులు పాటిస్తూ పోలీసువారికి సహకరించాలని గుడ్లవల్లేరు ఎస్సై ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయ పరిసరాల్లోని దుకాణదారులతో మాట్లాడి దుకాణాలకు వచ్చేవారిని రోడ్లపై పార్కింగ్ చేయకుండా చూసుకోవాలని ఎస్సై సూచించారు. ఆలయానికి అటు 100 మీటర్లు, ఇటు వంద మీటర్లు రహదారి వెంబడి బైక్‌లు, కార్లు ఇతర వాహనాలను పార్క్ చేయవద్దని ఆయన సూచించారు. ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అంతరాయాలు కలుగకుండా ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటిస్తూ ఉత్సవాలకు వచ్చే భక్తులకు, ప్రయాణించే ప్రయాణికులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదలచేయాలి

గుడివాడ : పెండింగ్‌లో ఉన్న రూ.6,400కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజయాన్యాల సంఘం చేపట్టిన నిరవధిక బంద్‌కు ఎస్‌ఎఫ్‌ఐ సంపూర్ణ మద్దతునిస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సమరం తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి అవసరం

● పొట్లూరి రవికుమార్

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు, నాయకులు అందరూ తమ తమ ప్రాంతాల్లో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్ అన్నారు. సోమవారం రాత్రి కొసరాజు వెంకటరామకృష్ణా రైస్‌మిల్ ఆవరణలోని టీడీపీ మండల కార్యాలయంలో గుడ్లవల్లేరు టీడీపీ గ్రామ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజా సమస్యలపై ప్రజలు అడుగుతున్న అవసరాలపై కార్యకర్తలతో సమీక్షించారు. గ్రామాల్లో ప్రజల అవసరాలపై దృష్టి సారించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి తెలిపారు. అలానే గుడ్లవల్లేరులో పలు అభివృద్ధి కార్యక్రమాల


సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రాంభోత్సవాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాముచే ఈ వారంలో ప్రారంభించాలని నిర్ణయించామని దానికి సంబంధించి నిర్వహణా, కార్యక్రమాలపై కార్యకర్తలతో గ్రామ పార్టీ నాయకులు, మండల పార్టీ నాయకులు చర్చించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని రంగబాబు, కార్యదర్శి సతీష్, గుడ్లవల్లేరు పీఏసీఎస్ చైర్మన్ యెనిగళ్ల నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పోలవరపు వెంకటరావు, మురాల నరేష్, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రసాయనేతర పద్ధతులతోనే అధిక దిగుబడులు

● కేవీకే సమన్వయకర్త సుధారాణి

పమిడిముక్కల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పంటలసాగులో రసాయనేతర పద్ధతులు అవలంబించి అవశేష రహిత పంట ఉత్పత్తులు పొందాలని కేవీకే సమన్వయకర్త సుధారాణి సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వీరంకిలాకు రైతు సేవాకేంద్రంలో ఖరీఫ్ పంటలసాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన, చర్చాగోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ పంటల సాగులో అధిక మోతాదులో రసాయనాలు వినియోగించడం వల్ల సాగు ఖర్చు అధికంగా మారి నికర ఆదాయం తగ్గుతుందన్నారు. రసాయనేతర పద్ధతులు అవలంభించడంద్వారా అవశేషన రహిత



సమావేశంలో మాట్లాడుతున్న సుధారాణి

పంట ఉత్పత్తులు పొందడంతో పాటు ఖర్చు తగ్గించుకోవచ్చని సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ పనితీరు, వినియోగించే విధానం, డ్రోన్ పిచికారీ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు, వెంకటలక్ష్మి, రేవతి, నందకిషోర్, పమిడిముక్కల వ్యవసాయ అధికారి గణేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విజేతలైన పాలిటెక్నిక్ విద్యార్థులతో రాజశేఖర్

## పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :విజయవాడ ఆంధ్రా లయోలా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వారు నిర్వహించిన జాతీయ స్థాయి ఫెస్ట్‌లో గుడ్లవల్లేరు ఏఏఎన్‌ఎం అండ్ వీవీఆర్ ఎస్‌ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొని పలు విభాగాల్లో జయకేతనం ఎగురవేశారని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ తెలిపారు. పేపర్ ప్రజంటేషన్ లో ప్రథమ,తృతీయ బహుమతులు సాధించారన్నారు. పోస్టర్ ప్రజంటేషన్ పోటీలలో ద్వితీయ, తృతీయ బహుమతులను, టెక్నికల్ క్విజ్‌లో ప్రథమ,తృతీయ బహుమతులు సాధించారని రాజశేఖర్ తెలిపారు. సంస్థ చైర్మన్ నాగేశ్వరరావు,కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహాయ కార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, రామాంజనేయులు అభినందించారు.


కావూరి శ్రీధర్‌కు వావిలాల పురస్కారాన్ని అందజేస్తున్న సమితి సభ్యులు

## గోపాలకృష్ణయ్య జయంతి

గుడివాడ : తెలుగు భాషా వికాస సమితి ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్యభవన్‌లో సోమవారం వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెదపారుపూడి డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ విచ్చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ప్రజాసమస్యల పరిష్కారానికి విశేష కృషి చేసిన ప్రజానేత వావిలాల గోపాలకృష్ణయ్య అని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అధికార భాషా సంఘం తొలి చైర్మన్‌గా ఆయన అందించిన సేవలు శ్లాఘనీయమన్నారు. తొలుత వావిలాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉత్తమ ఉపాధ్యాయుడు కావూరి శ్రీధర్‌కు వావిలాల గోపాలకృష్ణయ్య స్ఫూర్తి సాహితీ పురస్కారం-2025ను అందజేశారు. సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, సభ్యులు అవిర్నేని వెంకటేశ్వరరావు, చేడవరపు రూప, పీవీఎస్‌వీ రాజకుమారి, పాల్గొన్నారు.

## దళితుల సమాధులకు స్థలాన్ని కేటాయించాలి

● కంచర్ల సుధాకర్

గుడివాడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి) : గత 25సంవత్సరాలుగా దళితుల సమాధులకు స్థలాన్ని కేటాయించాలని అనేక పోరాటాలు చేస్తున్నా, స్థలాన్ని కేటాయించకపోవడం దారుణమని, వెంటనే భూమిని కేటాయించాలని దళిత సంఘాల నేత కంచర్ల సుధాకర్ కోరారు. సోమవారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయం వద్ద దళిత సమాధుల సాధన కమిటీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు సమాధులు లేక అనేక ఇబ్బందులు గురి కావల్సి వస్తోందన్నారు. అనేక పోరాటాల వల్ల గతంలో స్థానిక ఎఫ్‌సీఐ గోడౌన్‌ల వద్ద విస్సంశెట్టి పూర్ణచంద్రరావుకు చెందిన స్థలాన్ని కేటాయించాలని అప్పటి జిల్లా జాయింట్ కలెక్టర్ గంథం చంద్రుడు ఆదేశాలు జారీ చేశారన్నారు. స్థలం యజమాని కోర్టుకు వెళ్లడంతో


నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నేతలు

ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. దళితుల సమాధులకు స్థలాన్ని కేటాయించే వరకు పోరాటం తప్పదన్నారు. అనంతరం ఆర్‌డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పాస్టర్ జడ జానన్న, కొదమల గంగాధరరావు, వేశపోగు యేషయ్య, వేమూరి సుజాత, తాళ్లూరి ప్రశాంత్, మామిళ్ల ఏలీషా, మాణిక్యాలరావు, సుందరయ్య, రాజేష్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● సింగాల రాధాకృష్ణ

నందివాడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తుమ్మలపల్లి గ్రామంలో సర్పంచ్ సింగాల రాధాకృష్ణ పేర్కొన్నారు. స్వస్థ్ నారి - సశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు గ్రామాల్లో ఉచిత శిబిరాలు నిర్వహించనున్నట్లు కమ్యూనిటీ హెల్త్ అసిస్టెంట్ (సీహెచ్‌వో) సాయిప్రియ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రామాపురం పీహెచ్‌సీ వైద్యురాలు స్ఫూర్తి సింధూష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం సీహెచ్‌వో కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందన్నారు. అనంతరం టీబీ, కేన్సర్ రోగాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ సింగాల రాధకృష్ణ ఆధ్వర్యంలో వైద్యశిబిరానికి వచ్చిన వాళ్లకు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభావతి, శేషారత్నం, సుజాత, ఆంజనేయులు, నాగేశ్వరరావు, వీరమ్మ, తోట చినరాజు, దివ్య శంకర్ 104 సిబ్బంది, ఆశావర్కర్లు, హెల్త్ స్టాఫ్, గ్రామస్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ రాధాకృష్ణ

**గుడివాడ రూరల్ :** లింగవరంలో డాక్టర్ చంపక్ తేజ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వందలాది మంది వైద్యసేవలు పొందారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.అనూల, చిరంజీవి రెడ్డి, గోపాలకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాసులపేరు బహూకరణ

పమిడిముక్కల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హనుమంతపరంలో ఆంజనేయ సీతారామస్వామి ఆలయంలో సీతమ్మవారికి గ్రామానికి చెందిన కొల్లిపర సీతామహాలక్ష్మి 32.840 గ్రాముల బంగారు కాసులపేరు సోమవారం ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు కు అందజేశారు. అమ్మవారి అలంకరణ నిమిత్తం కాసులపేరును ఆలయ అర్చకుడు చక్రవర్తి, గ్రామస్థుల సమక్షంలో అందజేశారు.

## ఫోన్ తీసుకువెళ్లిన యువతిపై దాడి

గుడివాడ : స్థానిక ధనియాలపేట న్యూకాలనీకి చెందిన గూడపాటి అమ్ములుకు అల్లావుద్దీన్ ఖిల్జీ అనే యువకుడు సెల్‌ఫోన్‌ను బహుమతిగా ఇచ్చాడు. ఈ విషయాన్ని అమ్ములు తన సోదరుడు గూడపాటి గంగాధర్‌కు తెలిపింది. అమ్ములు స్నేహితురాలు అనూష అమ్ములుకు చెందిన ఫోన్‌ను తీసుకువెళ్లింది. విషయం తెలుసుకున్న గంగాధర్ కోపంతో అనూష ఇంటికి వెళ్లి దాడి చేశాడు. టీవీ పగలకొట్టి, ఫోన్ లాక్కుని వెళ్లాడు. అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ రామయ్య తెలిపారు.

## ఉచిత శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోండి

పామర్రు: నిమ్మకూరులోని ఎన్టీఆర్ మహిళ సాధికారిత కేంద్రంలో(మహిళ ప్రాంగణం) మహిళలలకు ఉచితంగా డేటా ఎంట్రీ ఆపరేటర్, బ్యూటీ థేరపిస్టు, హ్యాండ్ ఎంబ్రాయిడరిలో శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు ప్రాంగణం మేనేజర్ ఎస్.జుబేదా పర్వీన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవతరగతి ఉత్తీర్ణులైన 18-35 మధ్య వయస్సుగల మహిళలు అక్టోబర్ ఆరోతేదీలోగా దరఖాస్తులను ప్రాంగణంలో అందించాలని కోరారు. మరెన్ని వివరాల కోసం 8919575259 సంప్రదించాలన్నారు.

## పోషకాహారం తప్పనిసరి

పమిడిముక్కల : మహిళలు, పిల్లలకు పోషకాహారం ఎంతో అవసరమని వీరంకిలాకు పీహెచ్‌సీ డాక్టర్ అఖిల అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలీనఖీపాలెంలో వైద్యశిబిరం నిర్వహించి 22 మంది గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. . పీహెచ్‌ఎన్ ఝాన్సీ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 128, 137, 148 |
| చికెన్ విత్ స్కిన్ | 244 |
| చికెన్ స్కిన్‌లెస్ | 254 |

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

## ఈ-క్రాప్ పూర్తయ్యేలా సహకరించండి : మిల్లర్ల వినతి



మోపిదేవి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో నూరు శాతం ఈ-క్రాప్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ దివి రైస్ మిల్లర్లు తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. దివి రైసు మిల్లర్స్ అసోసియేషన్ నేతలు సోమవారం మధ్యాహ్నం తహసీల్దార్‌ను కలిసి ధాన్యం కొనుగోలు నిబంధనలకనుగుణంగా ఖరీఫ్ వరి పంట మొత్తం విస్తీర్ణం ఈ క్రాప్ చేసేలా సహకరించాలని కోరారు. ఈ-క్రాప్ జరగని పక్షంలో రైతులు, మిల్లర్లు తీవ్రంగా నష్టపోతామన్నారు.



## కలెక్టరేట్ వద్ద విద్యుత్ ఉద్యోగుల ధర్నా

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలంటూ విద్యుత్ ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. పది సంవత్సరాల సర్వీసు నిండిన వారందరికీ పే రివిజన్ అమలు చేసి ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, కారుణ్య నియమాకాలు జరపాలని, ఇంజనీరింగ్ చదివిన ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు సంఘ చైర్మన్ బొర్రా శ్రీనివాసరావు, కన్వీనర్ పి.అంకబాబు నాయకత్వం వహించారు.



## పదోన్నతులు కోరుతూ వీఆర్‌ఏల ధర్నా

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల తరబడి రూ.11 వేల జీతంతో ఎంతకాలం బతకేదని వీఆర్‌ఏల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతులు కల్పించాలంటూ వీఆర్‌ఏలు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. చాలా ఏళ్లుగా ఉద్యమిస్తున్నా ఉన్నతాధికారులు, ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ నాయకులు తాడిపర్తి తాతయ్య, లింగం ఫిలిప్, అడ్డాడ ప్రసాద్‌బాబు, ఒంటిపులి లక్ష్మణరావు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వీఆర్‌ఏలు పే స్కేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు.

## కనీస వేతనం కోరుతూ మున్సిపల్ కార్మికుల ధర్నా



పెడన, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెడన మునిసిపల్ కార్మికులు పురపాలక సంఘం కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ ఎల్. చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. చాలీచాలని జీతాలతో తాము ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రంలో కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని, రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న చెప్పులు, యూనిఫాం వెంటనే ఇవ్వాలని కోరారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యం లో జరిగిన ధర్నాలో పి.సుబ్రహ్మణ్యం, కైలా జ్ఞానప్రసాద్, పంచల నరసింహారావు, నందమూరు వెంకటేశ్వరరావు, వి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



తొలిరోజు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కలశ స్థాపన పూజలో పాల్గొన్న కలెక్టర్ డీకే బాలాజీ దంపతులు



బాలా త్రిపుర సుందరి దేవిగా పైడమ్మ, ఉరివి పార్వతీదేవి, పెదతుమ్మిడిలో పార్వతీదేవి, పెదకళ్లేపల్లి దుర్గమ్మ

## తొలిరోజు బాలా త్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సోమవారం వైభవంగా కలశ స్థాపనతో ప్రారంభమయ్యాయి. రాబర్టుసన్‌పేట రామలింగేశ్వర స్వామి, బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి, సర్కిల్‌పేట మల్లేశ్వర స్వామి, ఈడేపల్లి శక్తిగుడి, భాస్కరపురం త్రిశక్తిపీఠం, బుట్టాయిపేట దత్తాశ్రమం, కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో కలశ స్థాపన కార్యక్రమంలో కలెక్టర్ డీకే బాలాజీ దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ పూర్ణకుంభంతో కలెక్టర్ దంపతులకు స్వాగతం పిలికారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. **పెడన :** పైడమ్మ అమ్మవారిని తొలి రోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బూసం గిరిధర్, కాశీఅన్నపూర్ణాదేవి దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈవో జి.వి. కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ఆశాదిదాసు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. పైడమ్మ మూల విరాట్‌కు ఈవో కృష్ణారావు స్వర్ణకిరీటం అలంకరించారు. కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. తమ్మన లీలావెంకట శివరామ్, అన్నపూర్ణ దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. **పెడన రూరల్ :** మడక గంగా పార్వతి సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో జోగి ప్రకాశరావు, రజని దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. చోడవరం అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, చెన్నూరు గంగా పార్వతి సమేత నారాద లింగేశ్వర స్వామి, ఉరివి పార్వతీ సమేత సోమేశ్వరస్వామి, ఉప్పలకలవగుంట నాగేశ్వరస్వామి, నడుపూరు అగ్రహారం, బల్లిపర్రు, లంకలకలవగుంట, నందిగం శివాలయాల్లో అమ్మవార్లను విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. **బంటుమిల్లి :** దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా పెదతుమ్మిడి పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని రజిత కవచాలంకృత పార్వతీదేవిగా అలంకరించారు. స్వామి రుద్రాభిషేకం అనంతరం కలశస్థాపన చేసి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. **గూడూరు :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. గూడూరు గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. **మోపిదేవి :** పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానంలోఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ప్రత్యేక పూజలు జరిపి దసరా మహోత్సవాలను ప్రారంభించారు. అమ్మవార్లకు కుంకుమార్చన చేశారు. కొక్కిలిగడ్డ మల్లేశ్వరస్వామి ఆలయం, మోపిదేవి సకలేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. వెంకటాపురం, పెదప్రోలు, బొబ్బర్లంక, అన్నవరం గ్రామాల్లో చలువ పందిళ్లు వేసి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించి బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. **నాగాయలంక :** దుర్గా గణపేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి - అరుణ దంపతులు కలశ స్థాపన చేశారు. అమ్మవారు విజయదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు పోతుకూచి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. ఈవో సిహెచ్.సుధాకరరావు ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. కన్యకా పరమేశ్వరిఆలయంలో అమ్మవార్లుబాలాత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిట్టా సాంబశివరావు, చిట్టా వీర అన్నపూర్ణయ్య పర్యవేక్షించారు. కనక దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పులిగడ్డ కనకదుర్గమ్మ దేవాలయానికి మండలి వంశీకులు సారె సమర్పించారు. **ఘంటసాల :** సత్రం సెంటర్ రజకుల రామాలయం వద్ద దేవీశరన్నవరాత్రి మహోత్సవాలను వైభవోపేతంగా ప్రారంభించారు. ఆదిరాల భాస్కరరావు - భవాని దంపతులచే అర్చకులు ఆర్‌వి.ఎస్.సుధాకర్ శర్మ విశేష పూజ లు నిర్వహించారు. అమ్మవారు బాలాత్రిపురదేవిగా దర్శనమిచ్చారు. సుమన్ - చైతన్య దంపతులు విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, కమిటీ అధ్యక్షులు ఆదిరాల దుర్గాభవాని, పోతార్లంక శ్రీనివాస్, పోతార్లంక వెంకటేశ్వరరావు, ఆదిరాల రాముడు, సత్యనారాయణ, ప్రసాద్, భవాని తదితరులు పూజలు జరిపారు. **అవనిగడ్డ రూరల్ :** కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు రజిత కవచాలంకృత దేవిగా భ క్తులకు దర్శనమిచ్చారు. మండలి వెంకట కృష్ణారావు పర్యవేక్షించారు. పంచాయతీ ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వేకనూరు అంకాలమ్మ ఆలయంలో బాలాత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాదివాడ శ్రీనివాస పెరుమాళ్ల ఆధ్వర్యంలో పూజలు జరిపారు. **కోడూరు :** కనకదుర్గమ్మ, గంగానమ్మ, విశ్వనాథపల్లి, మందపాకల అద్దంకి నాంచారమ్మ. నరసింహాపురం రామాలయం వద్ద అమ్మవార్లు బాలాత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు చేశారు. కోడూరు కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన జరిపారు. **చల్లపల్లి :** అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం, లక్ష్మీపురం బాలపార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయం, బాలాత్రిపుర సుందరీ సహిత లక్ష్మీనాంచారమ్మ ఆలయం, చల్లపల్లి గ్రామదేవత, కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. **అవనిగడ్డ :** లంకమ్మ తల్లి బాలాత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) పర్యవేక్షించారు. ఉత్సవ పం దిళ్ల అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.



గూడూరులో... నరసింహాపురంలో.. అవనిగడ్డ లంకమ్మ.. గణపేశ్వరంలో..



ఘంటసాల సత్రం సెంటర్ రామాలయం వద్ద..

## వాసవీమాతకు పల్లకీ సేవ



చల్లపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణమండపం అధ్యక్షుడు కొల్లిపర నాగపోతురాజు(మధు) జెండా ప్రతిష్ఠ చేశారు. అర్చకులు మామిళ్లపల్లి శివరామకృష్ణ, పురోహితులు లంకా చక్రపాణి పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, విశేష హోమాలు జరిపారు. శ్రీవాసవీ భక్తబృందం గీతాపారాయణం, లలిత, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. శ్రీఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో నగర సంకీర్తన, పల్లకీసేవ నిర్వహించారు. సంఘ ప్రతినిధులు అన్నవరపు పాండురంగారావు, తమ్మన సతీష్‌కుమార్ వరదా రాజశేఖర్, కొల్లిపర నరేంద్ర పాల్గొన్నారు.



మూడు జిల్లాల స్థాయి తాళం భజన పోటీలను ప్రారంభిస్తున్న వెంకట్రామ్, కనపర్తి, బొబ్బా గోవర్ధన్

## మూడు జిల్లాల స్థాయి తాళం భజన పోటీలు ప్రారంభం

ఘంటసాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా చిట్టూర్పు గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో మూడు జిల్లాల స్థాయి తాళం భజన పోటీలను మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు బొబ్బా గోవర్ధన్ సోమవారం ప్రారంభించారు. తొలిరోజు పోటీల్లో ఐదు భక్త సమాజాలు పాల్గొన్నాయి పోటీలకు న్యాయనిర్ణేతలుగా పొడుగు ప్రసాద్, శ్రీనివాస్ వ్యవహరించారు. కొడాలి పీఏసీఎస్ అధ్యక్షుడుగుత్తికొండ వరప్రసాద్ పర్యవేక్షణలో జరుగుతున్న పోటీల ప్రారంభోత్సవంలో టీడీపీ మండల అధ్యక్షుడుతుమ్మల చౌదరిబాబు, పరిశె చలపతి, ఏఎంసీ చైర్‌పర్సన్ తోట కనకదుర్గ, సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, గూడపాటి వెంకటేశ్వరరావు, ఏపీ రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, ఏపీ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పైడిపాముల స్వప్న, రాష్ట్ర సాంస్కృతిక విభాగం జనరల్ సెక్రటరీ దిరిశం బాలకోటయ్య, వేమూరి రత్నగిరిరావు, వేములపల్లి సుధీర్, దాసరి సతీష్, దోనేపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నందిగంలో యానాదులకు శ్మశాన సమస్య

● అంత్యక్రియలకు స్థానికులు ససేమిరా

● రైతు పొలంగట్టుపై పూర్తి

పెడన రూరల్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : నందిగం గ్రామంలో ఈగ రాంబాబు(76) మృతి చెందగా అంత్యక్రియలు నిర్వహించటానికి ఆటంకం కలిగింది. ఎస్టీ యానాది వర్గానికి చెందిన రాంబాబు ఆదివారం మృతి చెందాడు. అంత్యక్రియలు నిర్వహించేందుకు బంధువులు ఏర్పాట్లు చేస్తుండగా స్థానికులు వ్యతిరేకించారు. వివిధ సామాజిక వర్గాలకు గ్రామంలో ఏడు శ్మశాన వాటికలు ఉన్నాయి. ప్రత్యేక శ్మశానవాటిక లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నామని యానాదులు వాపోయారు. నాయకులు వెంకటేశ్వరరావు, సర్పంచ్ బొడ్డు చినబాబు, జిల్లా ట్రైబల్ అధికారి ఫణిధూర్జటి, తహసీల్దార్ కె అనిల్‌కుమార్, ఎంపీడీవో ఎ అరుణకుమారి, డిఎస్పీరాజా, సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై సత్యన్నారాయణ గ్రామస్థులతో మాట్లాడారు. ఎవరూ అంగీకరించకపోవటంతో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. రెండుచోట్ల ఉన్నతాధికారుల అనుమతితో కేటాయించాలని నిర్ణయించుకున్నారు. స్థానిక రైతు పెద్ద మనస్సుతో రాంబాబు అంత్యక్రియలను తన పొలం గట్టుపై చేసుకోవాలని చెప్పడంతో అక్కడ పూడ్చిపెట్టారు.

## నిద్ర మాత్రలు మింగిన అటెండర్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విధులకు సక్రమంగా హాజరుకావాలని అధికారులు నిలదీయడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జనరల్ డ్యూటీ అటెండర్‌గా పనిచేస్తున్న దుర్గ సోమవారం నిద్ర మాత్రలు మింగారు. హుటాహుటి వైద్య సేవలందించడంతో ఆమె కోలుకుంది. విధులకు వచ్చిన సమయంలో ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా అటెండెన్స్ ఇవ్వాలని వైద్యులు, సూపరింటెండెంట్ చెప్పారు. ఆమె ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా అటెండెన్స్ నమోదు చేయలేదు. సంబంధిత సెక్షన్ ఇన్‌చార్జి అడిగినందుకు మనస్తాపం చెంది నిద్రమాత్రలు మింగింది. వైద్యులు తక్షణ సేవలందించారు.

## మత్స్యకారులను ఆదుకోవాలి

నాగాయలంక, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి తరచూ వరదల నేపథ్యంలో చేపల వేట లేక ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ కర్రి కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాస ప్రసాద్, మహిళా సహకార సంఘం అధ్యక్షురాలు లంకే అమ్మాజీ, మత్స్యకారులతో కలిసి ఆయన తహసీల్దార్ వీరాంజనేయులుకు వినతిపత్రా న్ని అందజేశారు. ప్రతి కుటుంబానికి 70 కిలోలు బియ్యం, నిత్యావసర సరుకులు తక్షణ సహాయంగా అందజేయాలని కోరారు. ఈ వాటిపల్లి భీక్షం, సైకం శివశంకర్, కర్రి నరసింహారావు, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## హోమియో రంగంలో కొత్త ఒరవడికి సోహన్‌సింగ్ శ్రీకారం

● వర్ధంతి సందర్భంగా ఘననివాళి

చల్లపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హోమియోరంగంలో కొత్త ఒరవడికి శ్రీకారంచుట్టిన డాక్టర్ సోహన్‌సింగ్ చిరస్మరణీయుడని చల్లపల్లి చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రం ట్రస్ట్ డైరెక్టర్ అడ్డాడ ప్రసాద్‌బాబు అన్నారు. ప్రముఖ హోమియోరంగ నిపుణులు డాక్టర్ సోహన్‌సింగ్ ద్వితీయ వర్ధంతిని సీఆర్ వికాస కేంద్రంలోని హోమియో శిబిరం సోమవారం నిర్వహించారు. పేదప్రజలకు ఉచితంగా వైద్యసేవలందించిన సోహన్‌సింగ్‌ఉచిత హోమియో వైద్యశిబిరాలకు వెన్నుదన్నుగా నిలిచారని కొనియాడారు. డాక్టర్ శ్రావణి, సిద్ధాబత్తుల వాసు, హర్ష, కొండలు తదితరులు పాల్గొన్నారు.

## పీ-4పై అవగాహన నేడు

పెడన రూరల్, సెప్టెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిలకు మంగళవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 కార్యక్రమంపై అవగాహనాసదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అరుణకుమారి తెలిపారు. సిబ్బంది, అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

## కొక్కిలిగడ్డ దాడి ఘటనలో నిందితుల అరెస్టు



నిందితులను మీడియాకు చూపుతున్న డీఎస్పీ విద్యశ్రీ

మోపిదేవి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కొక్కిలిగడ్డ గ్రామానికి చెందిన యలమంచిలి సురేష్ పై హత్యాయత్నం కేసులో షైలా శివకుమార్, పీతా నవీన్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నట్లు అవనిగడ్డ డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ తెలిపారు. మోపిదేవి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన బొబ్బర్లంకలో యలమంచిలి సురేష్‌పై శివకుమార్, నవీన్ కుమార్ దాడి చేయగా కోర్టుకు హాజరుపర్చారు. బెయిల్‌పై వచ్చిన ఇద్దరూ 15 రోజుల వ్యవధిలోనే సురేష్ ఇంటిపై ఈనెల 20వ తేదీన దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించారు. బంగారు గొలుసు, రూ.50 వేల నగదు దోచుకెళ్లారు. యలమంచిలి సురేష్ దంపతులు పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసి కొక్కిలిగడ్డ శివారు బండికోళ్లలంక కాలువ వంతెన వద్ద అదుపులోకి తీసుకున్నామన్నారు. శివకుమార్ విషం తాగి చనిపోతాను అంటూ బెదిరించడంతో ప్రభుత్వోద్యోగుల విధులకు ఆటంకం కలిగించటం వంటి సెక్షన్లు నమోదు చేసి, నిందితులను మొవ్వ కోర్టుకు హాజరుపర్చనున్నట్లు డిఎస్పీ విద్యశ్రీ తెలిపారు. ఎస్సై సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పాస్టర్ దుర్మరణం



ఘంటసాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని ఢీకొని పాస్టర్ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. మచిలీపట్నం మం డలం బుద్దాలపాలెంకు చెందిన పాస్టర్ కన్నా సుబ్బారావు (ప్రేమ్ రాజ్) (41) దేవుని వాక్య పరిచర్య నిమి త్తం బాపట్లలోని మోర్తోట గ్రామానికి వెళ్లాడు. భార్య, కుమార్తెతో కలిసి స్కూటీపై తిరిగి వస్తున్న క్రమంలో లంకపల్లి వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. పాస్టర్ ప్రేమ్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య పావని ఫిర్యాదు మేరకు ఘం టసాల ఎస్సై ప్రతాప్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.